



మహాత్మ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న డీఆర్వో వెంకటేశ్వర్లు

గాంధీ మార్గం అనుసరణీయం

భీమవరం టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి) జాతిపిత మహాత్మా గాంధీ మార్గం అనుసరణీయమని జిల్లా రెవెన్యూ అధికారి మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు గురు వారం జాతిపిత మహాత్మా గాంధీ 77 వర్ధంతి సందర్భంగా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ గాంధీజీ జీవితం మన అందరికీ ఆదర్శం అన్నారు. భారతదేశ స్వాతంత్ర్యానికి గాంధీజీ చేసిన అహింసాయుత పోరాటం ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచిందన్నారు.


నేడు పెనుగొండకు

సీఎం చంద్రబాబు



సీఎం దిగే హెలీప్యాడ్‌ను తనిఖీ చేస్తున్న బాంబ్ స్క్వాడ్


- వాసవీ మాతకు సతీ సమేతంగా పట్టువస్త్రాల సమర్పణ.. అధికారులు ఏర్పాట్లు పూర్తి



పెనుగొండ/ఆచంట, జనవరి 30(ఆంధ్రజ్యోతి):ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సతీ సమేతంగా శుక్రవారం పెనుగొండ రానున్నారు. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ రోజును పురస్కరించుకుని ఇక్కడ ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఆపై రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పిస్తారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీప కాంతులతో మెరిసిపోతోంది. సీఎం పర్యటన నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వివిధ శాఖ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రెండు రోజులుగా కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీమ్ అస్మి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, దేవస్థానం అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో కన్యకా పరమేశ్వరి, వాసవి ధామ్ ఆలయాల వద్ద ఏర్పాట్లు చేశారు.

సీఎం టూర్ షెడ్యూల్


- ఉదయం 10.30 గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 11.05 గంటలకు పెనుగొండ ఏఎంసీ లోని హెలీప్యాడ్‌కు చేరుకుంటారు.
- 11.05 నుంచి 11.10 వరకు హెలీప్యాడ్ వద్ద ప్రజలను కలుసుకుంటారు.
- 11.15 గంటలకు రోడ్డు మార్గంలో కన్యకా పరమేశ్వరి ఆలయానికి చేరుకుంటారు.
- 11.45 వరకు ఆలయంలో ఉంటారు.
- 11.50 గంటలకు వాసవి ధామ్‌కు చేరుకుంటారు.
- 12.15 ఏఎంసీలోని హెలీప్యాడ్‌కు బయలు దేరతారు.
- 12.20 గంటలకు హెలీకాప్టర్‌లో తిరిగి ఉండవల్లికి పయనమవుతారు.



6

ఆత్మగౌరవ రక్షణకు.. ఆత్మార్పణ

పెనుగొండ నగరేశ్వరస్వామి ఆలయంలో ఆత్మార్పణ చేసుకున్న వాసవాంబ.. వాసవీ కన్యకా పరమేశ్వరిగా అవతరించారు. తనను పెళ్లి చేసుకోవాలనుకున్న రాజు విష్ణువర్ధనుడి నుంచి పెనుగొండను రక్షించేందుకు, తన ఆత్మ గౌరవాన్ని కాపాడుకునేందుకు ఆత్మార్పణ చేసుకుంది.. నేడు వాసవీమాత ఆత్మార్పణ రోజు.



ఆచంట రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సర్వర్ డౌన్ కావడంతో పని చేయని కంప్యూటర్లు

సర్వర్ డౌన్

- జిల్లాలో రిజిస్ట్రేషన్లు నత్తనడక
- కక్షిదారుల్లో ఆందోళన
- రేపటి నుంచి పెరగనున్న రిజిస్ట్రేషన్ చార్జీలు

ఆచంట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఫిబ్రవరి 1వ తేదీ నుంచి భూముల విలువలు పెంచుతామని ప్రకటించడంతో కొన్ని రోజులుగా రిజిస్ట్రేషన్‌లు ముమ్మరంగా సాగుతున్నాయి. జిల్లాలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కక్షిదారులతో కిటకిటలాడుతున్నాయి. అయితే గురువారం రిజిస్ట్రేషన్‌కు సంబంధించి సర్వర్ సరిగ్గా పని చేయకపోవడంతో జిల్లాలోని అన్ని చోట్ల రిజిస్ట్రేషన్‌లు నత్తనడకన జరిగాయి. అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కక్షిదారులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి అన్ని చోట్ల సర్వర్ సమస్య తలెత్తడంతో రిజిస్ట్రేషన్‌లు నెమ్మదిగా జరిగాయి. సాయంత్రం వరకు ఇదే పరిస్థితి కొనసాగింది. రిజిస్ట్రేషన్‌లు ఫుల్‌గా ఉన్నప్పటికీ సర్వర్ డౌన్ కారణంగా అనేక మంది కక్షిదారులు సంబంధిత అధికారుల తీరు పై తమ ఆవేదన వ్యక్తం చేశారు. భూమి విలువలు పెరుగుతున్న కారణంగా దానికనుగుణంగానే సర్వర్ సమస్య లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులుపై ఉన్నప్పటికీ రెండు రోజులుగా సర్వర్ సమస్య తలెత్తుండంతో అటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది, ఇటు కక్షిదారులు కూడా తమ ఆవేదనను అనేక కార్యాలయాలు వద్ద వ్యక్తం చేశారు. కనీసం శుక్రవారం అయినా సర్వర్ సమస్య తలెత్తకుండా చూడాలని కక్షిదారులు కోరుతున్నారు.

ఆకివీడు: రిజిస్ట్రేషన్ ధరలు పెరుగుతున్నాయన్న సమాచారంతో ఆకివీడులో బుధవారం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దీ పెరిగింది. రాత్రి పూట కూడా రిజిస్ట్రేషన్లు కొనసాగాయి. గురువారం సర్వర్లు స్లోగా ఉండడంతో ఆకివీడులో రాత్రి 9 గంటలకు బంద్ చేశారు. శుక్రవారం చివరి రోజు కావడంతో రద్దీ మరింత తీవ్రంగా ఉంటుందంటున్నారు. ఆకివీడులో గతంలో రోజుకు పది, పన్నెండు రిజిస్ట్రేషన్లు అయ్యేవి. అటువంటిది మంగళవారం-26, బుధవారం-36, గురువారం-30 అయినట్లు అధికారులు తెలిపారు.



కోడ్ కూసింది!

- అమలులోకి ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్
- సాధారణ ఎన్నికలకు ఉన్నట్లే ఈ ఎన్నికకు కోడ్
- అధికారులకు కలెక్టర్ నాగరాణి సూచనలు

భీమవరం టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ ఎన్నిక కోసం ఈ నెల 29న షెడ్యూల్ వెలువడినందున ఆ రోజు నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ ఎన్నిక కోసం ఏలూరు జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తారని, పశ్చిమగోదావరి, తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ, అల్లూరి సీతారామ రాజు జిల్లాల డీఆర్వోలు సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరించనున్నట్లు తెలిపారు. వచ్చేనెల 3న ఏలూరు జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ విడుదల చేస్తారని, నామినేషన్ల స్వీకరణ ఏలూరు కలెక్టరేట్‌లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఉంటుందని, వచ్చేనెల10వ తేదీ ఆఖరు తేదీయని (ప్రభుత్వ సెలవు దినాలు మినహా), 11న స్క్రూట్నీ, 13న ఉపసంహరణకు అవకాశం ఉందని తెలిపారు. వచ్చేనెల 27న ఎన్నిక ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం4 గంటల వరకు జరుగుతుందని, ఓట్ల లెక్కింపు మార్చి 3న ఉంటుందని, మార్చి 8 లోపల ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుందని స్పష్టం చేశారు. ఎన్నికల నిర్వహణపై గురువారం అధికారులతో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించి పలు ఆదేశాలను జారీ చేశారు. ఎన్నికల కోడ్ సాధారణ ఎన్నికలకు ఉన్నట్లే ఉంటుందని, పొలిటికల్ ప్రతినిధుల అధికారిక కార్యక్రమాలు ఉండకూడదని, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయకూడదని, పొలిటికల్ పోస్టర్లు, ఫ్లెక్సీలు తొలగించాలని తెలిపారు. మోడల్ కోడ్ అమలు బృందాలు, ఎఫ్.ఎస్.టి బృందాలు పని చేస్తాయని తెలిపారు. తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లను ఆర్.డి.ఓలు గుర్తించాలని తెలిపారు. తహసీల్దార్లు, స్టేషన్ హౌస్ ఆఫీసర్లు వెంటనే తమ పరిధిలో ఉన్న పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి, అన్నిరకాల వసతులు ఉన్నవి లేనిది తనిఖీ చేసుకోవాలని తెలిపారు. వాహనాల కోసం, బాలెట్ బాక్స్‌ల కోసం ఇండెంట్ పెట్టాలని తెలిపారు. బ్యాలెట్ పేపర్ ద్వారా ఓటింగ్ జరుగుతుందని, బ్యాలెట్ బాక్సులను తనిఖీ చేసి ఆయిలింగ్ చేసి సిద్ధంగా ఉంచాలని తెలిపారు.

జిల్లాలో 69,884 మంది పట్టభద్రుల ఓటర్లు

జిల్లాలో 93 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని, జిల్లాలోని 20 మండలాల్లో మొత్తం 69,884మంది పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని, వారిలో 39,780 మంది పురుషులు కాగా, 30వేల103 మంది మహిళా ఓటర్లు, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారని తెలిపారు. ఫారం-18లో గ్రాడ్యుయేట్ల పేర్లను చేర్చడానికి దరఖాస్తులను వచ్చేనెల 10 వరకు, అంటే నామినేషన్లు స్వీకరించడానికి చివరి తేదీ వరకు తీసుకుంటారని తెలిపారు.



శ్వాస..ధ్యాస.. బుర్రకథ!

మిరియాల అప్పారావు.. మొన్నటి వరకూ ఒక బుర్రకథ కళాకారుడు మాత్రమే.. ఆయన కళ కోసం ఎంత పరితపించారనేది సమాజానికి తెలియని వాస్తవం..ఆ వాస్తవంలోకి వెళ్లి చూస్తే ఆకలి.. కష్టాలు.. కన్నీళ్లు.. బాధలు.. బాధ్యతలు.. అయినా ఆయన మాత్రం కళను వదల్లేదు.. చివరి వరకూ కళనే ఊపిరిగా చేసుకుని జీవించారు.. ఎంతో మంది ఆ కళతో ఏం సాధించా వన్నా చిరునవ్వే సమాధానం.. బుర్రకథకు ఆద రణ తగ్గినా తుది వరకూ అదే ఊపిరిగా బతి కారు.. ఈ నెల 15వ తేదీన కళామతల్లి ఒడిలోనే ఒరిగిపోయారు..ఆయన లేకున్నా.. కష్టం ఎక్కడికి పోతోంది.. అందుకే కేంద్రం అందించే ఎంతో అత్యున్నత పురస్కారం పద్మశ్రీ దశదినకర్మ రోజునే వెతుక్కుంటూ వచ్చింది.. మళ్లీ మిరియాల బుర్రకథకు ఊపిరులూదింది..! - వివరాలు 6లో

కుంభమేళాకు ఏలూరు నుంచి రెండు ఆర్టీసీ బస్సులు

అంతర్వేది కల్యాణోత్సవానికి 50 బస్సులు

ఏలూరు క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు నుంచి ప్రయోగరాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాకు రెండు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు ఏలూరు జిల్లా పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ ఎన్‌వీఆర్ వర ప్రసాద్ చెప్పారు. ఏలూరులోని ఆయన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీపీటీవో వర ప్రసాద్‌తోపాటు ఏలూరు డిపో మేనేజర్ బి.వాణి, ఏఎంటీ జి.మురళి, పీఆర్వో కేఎల్‌వీ నరసింహం పాల్గొన్నారు. డీపీటీవో ప్రసాద్ మాట్లాడుతూ ప్రయాణికుల కోరిక మేరకు ఫిబ్రవరి 4వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు ఏలూరు బస్ డిపో నుంచి ప్రయోగరాజ్‌కు రెండు బస్సులు నడుపుతున్నామన్నారు. ఈ బస్సులు ఏలూరులో బయలుదేరి పూరీ, కోణార్క్, భువనేశ్వర్, ప్రయాగరాజ్, సంగమస్థానం, కాశీ, అయోధ్య, గయ, బుద్ధగయ, తిరుగు ప్రయాణంలో ఆంధ్ర రాష్ట్రంలో ప్రఖ్యాతి గాంచిన అరసవల్లి సూర్యదేవాలయం, శ్రీకూర్మం దర్శనం అనంతరం ఏలూరు చేరుకుంటారన్నారు. ఈ యాత్ర మొత్తం 8 రోజులు ఉంటుందని, యాత్రికులకు ఉదయం, రాత్రి అల్పాహారం, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తారన్నారు. యాత్ర ఖర్చు రూ.12,500 అని ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 93467 67670 నెంబరుకు సంప్రదించాలన్నారు.

శివరాత్రికి ప్రత్యేక బస్సులు

ఫిబ్రవరి 26న వచ్చే మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా బలివే క్షేత్రానికి ఏలూరు - నూజివీడు నుంచి 60 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. పట్టిసీమకు జంగారెడ్డిగూడెం నుంచి 30 బస్సులు, తాడేపల్లిగూడెం నుంచి 20 బస్సులు, తాడేపల్లిగూడెం వద్ద ఉన్న వీరంపాలెంకు తాడేపల్లిగూడెం నుంచి 10 బస్సులు, ఏలూరు నుంచి 4 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఫిబ్రవరి 7,8 తేదీల్లో జరిగే అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి కల్యాణానికి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 50 బస్సులు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.



లెక్క తేల్చండి..!

- విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యలో పొంతన లేని వివరాలు
- ఐదు రకాల బడుల ఖరారుపై అధికారుల కసరత్తు..
- నేడు ఎంఈవోలతో సమావేశం

7

కోతలు..కుట్లు!

- ఆడపడుచులకు తప్పని ప్రసవ బాధలు
- కాసుల కక్కుర్తితో పెరుగుతున్న ఆపరేషన్లు
- దృష్టి పెట్టిన జిల్లా వైద్యాధికారులు

భీమవరం టౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : తల్లి, బిడ్డకు ఎటువంటి ఇబ్బందులు ఉండకూడదు. సుఖ ప్రసవం జరగాలి. ఎంత ఖర్చు అయినా పర్వాలేదు. అనే కారణంతో జిల్లాలో నార్మల్ డెలివరీ కంటే సిజేరియన్ ఆపరేషన్‌ల సంఖ్య పెరిగిపోతున్నది. సిజేరియన్ వల్ల కలిగే నష్టాలను పక్కన పెట్టి మరీ ఆపరేషన్‌లకే ప్రాధాన్యత ఇస్తున్నారు. గతంలో పండంటి బిడ్డను కన్నారని అన్నారు. ఇప్పుడు లక్షలు పోసి బిడ్డను కన్నామనే పరిస్థితి నెలకొంది. కొన్ని ఆస్పత్రుల్లో నార్మల్ డెలివరీల కోసం ప్రయత్నాలు జరగుతున్నాయి. అయితే ప్రసవం సమయంలో కొద్దిగా ఆలస్యమైనా బంధువుల్లో ఆందోళన మొదలవుతుంది. తల్లి,బిడ్డ క్షేమం కోరి ఆపరేషన్ చెయ్యాలని డాక్టర్లను కోరుతుంటారు. ఆపరేషన్ల సంఖ్య పెరగడానికి ఇదొక కారణం కూడా చెప్పవచ్చు. మరికొన్ని ఆస్పత్రుల్లో నార్మల్ డెలివరీలకు ప్రయత్నించకుండా ఆపరేషన్లు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నార్మల్ డెలివరీలపై ప్రభుత్వం ఎంత ప్రచారం చేసినా ఉపయోగం కనిపించడం లేదు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్‌లు ఎక్కువగా ఉండటంతో జిల్లా వైద్యశాఖాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు.



సిజేరియన్‌ల నివారణపై ప్రత్యేక దృష్టి

జిల్లాలో నార్మల్ డెలివరీలు కంటే సిజేరియన్‌ల సంఖ్య ఎక్కువగా ఉండటంతో జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రతి మూడు నెలలకు జరిగే సమావేశంలో దీనిపై దృష్టిపెట్టడంతో గతం కంటే ఇప్పుడు సిజేరియన్ ఆపరేషన్‌లు సంఖ్య తగ్గినట్లుగా జిల్లా వైద్యాధికారులు చెబుతున్నారు. ఇప్పుడున్న సంఖ్యకంటే మరింత తగ్గించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు. ఎందుకు సిజేరియన్ చెయ్యవలసి వచ్చిందో సంబంధిత ఆస్పత్రి నిర్వాహకుల నుంచి వివరణలు తీసుకుంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రులకు సంబంధించి కూడా వివరణలు సేకరిస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో ప్రసవాల వివరాలు

సంవత్సరం	మొత్తం డెలివరీలు	ప్రభుత్వ ఆస్పత్రుల్లో	సిజేరియన్స్	నార్మల్	ప్రైవేట్ ఆస్పత్రుల్లో	సిజేరిన్	నార్మల్
2022-23	25741	8623	4681	3932	17118	11560	5,560
2023-24	27356	7912	4344	3568	19444	15635	3,809
2024-25	15399	6244	3664	2580	9155	6849	2306

నార్మల్ డెలివరీలతో ప్రయోజనం

నార్మల్ డెలవరీ వల్ల తల్లి, బిడ్డకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఆరు వారాల్లో ఇద్దరు మాములు స్థితికి చేరుకుంటారు. బిడ్డకు తల్లి పాలు పూర్తి స్థాయిలో లభించటం వల్ల బిడ్డ ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడుతుంది. హార్మోన్ మార్పుకూడా ఉండదు. అన్ని పనులు సక్రమంగా చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

అపోహలతో ఆపరేషన్‌ల వైపు..

చాలా మంది తల్లులు అపోహలతో ఆపరేషన్‌ల వైపు మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా జాతకాల ప్రభావం ఎక్కువగా ఉంటోంది. ఫలాన సమయం, నక్షత్రంలో బిడ్డ పుట్టాలనే ఆలోచన వల్ల కొంత మంది సిజేరియన్‌లవైపు మొగ్గు చూపుతున్నారు. అంతేకాకుండా తల్లి, బిడ్డలకు ఎటువంటి ఇబ్బందులు ఉండకూడదనే అనాలోచిత నిర్ణయం వంటి కారణాలు కనిపిస్తున్నాయి.

గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నాం

డీఎంఅండ్‌హెచ్‌వో భానునాయక్

సిజేరియన్ చేయ్యటం వల్ల కలిగే నష్టాలు, నార్మల్ డెలివరీ వల్ల కలిగే ప్రయోజనాలపై ప్రతినెల 9,10 తేదీల్లో పీహెచ్‌సీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. సిజేరియరిన్‌లు ఎక్కువగా చేసే ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి వివరణలు తీసుకుంటున్నాం. తల్లి బిడ్డ ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్నాం.




బాల్ బ్యాడ్మింటన్ ప్రథమ బహుమతి అందుకుంటున్న సెయింట్ థెరిస్సా కళాశాల జట్టు... కప్ అందుకుంటున్న హ్యాండ్‌బాల్ క్రీడాకారిణుల జట్టు

నన్నయ వర్సిటీ ఛాంపియన్లుగా సెయింట్ థెరిస్సా జట్లు

ఏలూరు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఆదికవి నన్నయ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ, పీజీ కళాశాలల క్రీడాకారులకు ఇటీవల నిర్వహించిన ఆటల పోటీల్లో ఏలూరు సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల విద్యార్థినులు నన్నయ వర్సిటీ చాంపియన్లుగా నిలిచారు. నిడదవోలు ఎస్.వి.డి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఈనెల 24న జరిగిన అంతర్ కళాశాలల మహిళల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కళాశాల విద్యార్థినులు జి.పూజ, జి.పుణ్య, పి.నాగ వినయశ్రీ బృందం ప్రథమ బహుమతిని గెలుచుకుని అలగప్ప విశ్వవిద్యాలయం (తమిళనాడు)లో నిర్వహించనున్న ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌కు నన్నయ వర్సిటీ జట్టుగా ఎంపికయ్యారు. టీం మేనేజర్‌గా కె.శ్యామల వ్యవహరించారు. ఈనెల 27, 28 తేదీల్లో అన్నవరంలోని డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాలల మహిళల హ్యాండ్‌బాల్ పోటీల్లో కళాశాల విద్యార్థినులు ఎస్.జెస్సితన్మయ్, టి.జ్యోతి, ఏ.షల్లి, జి.పుణ్య బృందం ప్రథమ బహుమతి గెలుచుకుని పెరియార్ యూనివర్సిటీ (తమిళనాడు)లో జరుగనున్న అంతర్ విశ్వవిద్యాలయ టోర్నమెంట్‌కు నన్నయ యూనివర్సిటీ జట్టుగా ఎంపికయ్యారు. కోచ్‌లుగా జిల్లా హ్యాండ్‌బాల్ శిక్షకులు మోహన్, రవికుమార్‌లు వ్యవహరించారు. త్వరలో నిర్వహించనున్న అఖిలభారత విశ్వ విద్యాలయాల క్రీడా టోర్నమెంట్‌లలో నన్నయ యూనివర్సిటీ జట్లుగా ఎంపికైన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వ్యాయామోపాధ్యాయురాలు మేజర్ సెలీన్‌రోజ్ అభినందించారు. వీరందరికీ స్పెషల్ డైట్, ఫీజు రాయితీలను కల్పించాలని కళాశాల యాజమాన్యం నిర్ణయించిందని ప్రిన్సిపాల్ తెలిపారు.



పోటీలను ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కళాశాల సిబ్బంది

ఉత్సాహంగా అంతర కళాశాలల హ్యాండ్ బాల్ పోటీలు

దెందులూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : వేగవరం హేలాపురి ఇంజనీరింగ్ గ్రౌండ్‌లో జెఎన్‌టీ యూ కాకినాడ ఆధ్వర్యంలో 6 జిల్లాల అంతర కళాశాల హ్యాండ్ బాల్ పోటీలు ఉత్సాహంగా గురువారం ప్రారంభమయ్యాయి. పోటీలను ప్రిన్సిపాల్ ఎం.లావణ్య ఆధ్వర్యంలో జేఎన్‌టీయు క్రీడా విభాగం కౌన్సిల్ కార్యదర్శి శ్యామ్, వ్యాయామ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియాల్, డీఎస్‌డీవో శ్రీనివాసరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. రెండురోజుల పాటు జరిగే ఈ పోటీల్లో ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా గుంటూరు పరిధిలో ఆరు జిల్లాలో 200 మంది క్రీడా కారులు తలపడుతున్నారు. తొలుత గుంటూరు జిల్లా సెయింట్ మేరీస్ కాలేజీ ఏలూరు సీఆర్ రెడ్డి కాలేజీ క్రీడాకారులు తలపడ్డారు. వీఆర్ సిద్ధార్థ వర్సెస్ మాచర్ల నూటన్స్ కాలేజీ తలపడ్డారు, రామచంద్ర కాలేజీ జెఎన్‌టీయూ కాలేజీ క్రీడాకారులు తలపడ్డారు. బాల పోటీలు రసవత్తంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఫైనల్ పోటీలు జరుగుతాయని ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో జరిగే హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొం టారని ప్రిన్సిపాల్ తెలిపారు.



ఓం కుసుమ పుత్రీచ
విద్మహే కన్యకుమారి ధీమహి !
తన్నో వాసవీ ప్రచోదయాత్ !

పెనుగొండ క్షేత్రంలో నగరేశ్వర స్వామి ఆలయంలో ఆత్మార్పణ చేసుకున్న వాసవాంబ వాసవీ కన్యకా పరమేశ్వరిగా అవతరించారు.. తనను వివాహ మాడదలచిన రాజు విష్ణువర్ధనుడి నుంచి పెనుగొండను రక్షించేందుకు, తన ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు ఆత్మార్పణ చేసుకుంది.. నేడు వాసవీమాత ఆత్మార్పణ చేసుకున్న రోజు..

ఆత్మగౌరవ రక్షణకు ఆత్మార్పణ

నేడు పెనుగొండలో వాసవీ మాతకు సీఎం పూజలు

పెనుమంట్ర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వేంగి దేశాన్ని ఏలే కుసుమ శ్రేష్టి వైశ్యులకు రాజు. ఈ ప్రాంతం విష్ణు వర్ధనుడు (విమలాదిత్య మహారాజు) ఆధీనంలో ఉండేది. క్రీ.శ 10, 11వ శతాబ్ధాలలో కుసుమ శ్రేష్టి సుమారు 18 పరగణాలను పెనుగొండను రాజధానిగా చేసుకుని పాలిస్తూ ఉండేవాడు. ఆయన, ఆయన భార్య కుసుమాంబ ఆదర్శ దంపతులుగా మెలిగి ప్రశాంతమైన జీవనం గడిపేవారు. వివాహం అయిన చాలా సంవత్సరాలకి కూడా సంతానం కలుగ లేదు. రాజ్యానికి వారసులు లేక వారు చింతించేవారు. తమ కులగురువును సంప్రదించగా పుత్ర కామేష్టి యాగాన్ని చేయమని చెప్పారు. భక్తి , శ్రద్ధలతో యాగాన్ని ఆచరించారు.. కొన్ని దినాలకే కుసుమాంబ గర్భవతి అయినది. వైశాఖ శుద్ధ దశమి, శుక్రవారం ఉత్తర నక్షత్రం కన్య రాశిలో కుసుమాంబ కవల పిల్లలకి జన్మ ఇచ్చింది. వారిలో ఒకరు ఆడపిల్ల , మరొకరు మగ పిల్లవాడు. అబ్బాయికి విరూపాక్ష అని అమ్మాయికి వాసవాంబ అని నామకరణం చేశారు. వాసవి అన్నికళలను , తర్క శాస్త్రాలను అభ్యసించి తెలివైన అమ్మాయిగా పేరు తెచ్చుకుంది. రాజు అయిన విష్ణు వర్ధనుడు తన రాజ్య విస్తరణలో భాగంగా పెనుగొండకి విచ్చేయగా వాసవిని చూసి మోహించాడు. ఆమెను వివాహమాడ నిశ్చయించాడు. కుసుమశ్రేష్టి కుమార్తెగా తెలుసుకుని వివాహ వర్తమానం పంపాడు. అయితే వాసవికి ఈ వివాహం ఇష్టం లేదని రాజుకు తెలియజేయడంతో ఆగ్రహించిన ఆ రాజు తన సైన్యాన్ని పంపి బలవంతంగా అయినా వాసవిని తీసుకురమ్మని ఆజ్ఞాపించాడు. కుసుమ శ్రేష్టి వైశ్య కులములో గల 714 గోత్రముల వారిని నగరేశ్వర స్వామి వారి ఆలయం నందు సమావేశ పరిచి విషయం వారికి తెలియజేశారు.అంతట వారిలో 103 మంది గోత్రీకులు క్షత్రియులతో వివాహం చేయడానికి అంగీకరించలేదు. వాసవి మాత్రం రాజును వివాహం చేసుకోవడానికి నిరాకరించింది. తాను పార్వతీదేవి అంశంతో జన్మించానని అగ్ని ప్రవేశం చేయనున్నట్లు తెలియజేసింది. వాసవితో పాటు 103 మంది గోత్రీకులు అగ్ని ప్రవేశం చేసేందుకు నిశ్చయించారు. ధర్మాన్ని రక్షించేందుకు, స్త్రీల గౌరవాన్ని కాపాడేందుకు, విష్ణువర్ధనుడిని అంతం చేసేందుకు, వైశ్యుల ఆత్మగౌరవాన్ని చాటేందుకు కలియుగంలో జన్మించానని చెప్పి అగ్నిగుండంలో దూకింది.. అప్పటికే తన సేనలతో పెనుగొండ పొలిమేరల్లో ప్రవేశించిన రాజు జరిగిన విషయం తెలిసి హృదయం కలిచివేసింది. రక్తం కక్కుని అక్కడికక్కడే మరణించాడు. ఈ సంఘటన తెలుసుకున్న విష్ణువర్ధనుని కుమారుడు రాజరాజ నరేంద్రుడు హుటాహుటిన పెనుగొండ పట్టణం చేరుకున్నాడు. వాసవీ గౌరవార్థం ఒక విగ్రహాన్ని ప్రతిష్టించాడు. అప్పటి నుంచి వైశ్యులందరు వాసవీ మాతను తమ కుల దేవతగా తలచి పూజలు చేస్తున్నారు.



పెనుగొండ వాసవీ శాంతిధామ్‌లో విద్యుద్దీప కాంతుల్లో అమ్మవారి విగ్రహం



అధికారికంగా ఆత్మార్పణ దినం

ఆచంట/పెనుగొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ చేసుకొన్న రోజును ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని ప్రకటించింది. ఇందులో భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 31న పెనుగొండ నగేశ్వరస్వామి ఆలయంలో జరగనున్న ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించనున్నారు. ముందుగా కన్యకాపరమేశ్వరిని దర్శించుకున్న అనంతరం పక్కనే ఉన్న వాసవీ ధామ్‌ను సందర్శించి ప్రత్యేక పూజలు చేయనున్నారు. మాఘశుద్ధ విదియ రోజున 102 మంది గోత్రీకులతో వాసవీ ఆత్మార్పణ చేసుకున్నారు. పెనుగొండ నగరేశ్వరస్వామి ఆలయంలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారుగా వెలిశారు.

నేడు కార్యక్రమాలు ఇలా

- ఉదయం 6 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, స్వామి, అమ్మవార్ల మూల విరాట్‌లకు అభిషేకాలు,
- 8 గంటలకు వాసవి మాత దీక్షా దారులు అమ్మవారికి గ్రామంలో పల్లకి ఉత్సవం నిర్వహిస్తారు. అనంతరం హోమాలు చేస్తారు.
- మధ్యాహ్నం 12 గంటలలకు 102 హోమ గుండాల్లో మహాపూర్ణాహుతి. అనంతరం దర్శనాలు, మాలదారుల దీక్ష విరమణ, 12.30కు అన్న సమారాధన
- మధ్యాహ్నం 3 నుంచి దర్శనాలు, హారతి కార్యక్రమాలు
- రాత్రి 7 నుంచి నిప్పులగుండం. 8.30లకు నీరాజన మంత్ర పుష్పాలు, ప్రసాద వితరణతో ముగుస్తాయి.

సేంద్రియ సాగుతో ఉపాధి



కూరగాయలు కోస్తున్న కిశోర్ దంపతులు

పెదపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : అరెకరం పొలం కౌలుసాగుకు తీసుకుని టమాటా, బీర, ఆనబ, బెండ పంటలతో పాటుగా వాటిలో అంతర పంటగా బంతిపూల సాగు చేస్తూ నలుగురికి ఆదర్శంగా నిలుస్తున్నారు పెదపాడు మండలం కొత్తూరు గ్రామానికి చెందిన కిశోర్ దంపతులు. వ్యవసాయకూలీ జీవనాధారంగా బతికే వీరు నిత్యం చేసేందుకు పనుల్లేకపోవడంతో కొన్నేళ్ల క్రితం కొత్తూరు-పెదపాడు ప్రధాన రహదారి పక్కన భూమిని కౌలుకు తీసుకుని రసాయన ఎరువుల జోలికి పోకుండా సేంద్రీయ ఎరువులను వాడుతూ నాణ్యమైన కూరగాయలను పండించి, అక్కడే రోడ్డుపక్కన వాటిని అమ్ముతున్నారు. మార్కెట్ ధర కంటే తక్కువగా నాణ్యతలో మెరుగ్గా ఉండ టంతో పరిసర ప్రాంతాల ప్రజలు వీరివద్ద కూరగాయలను కొంటూ సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కూరగాయల సాగులో చీడపీడలు, కోతుల బెడదలు వున్నా వాటన్నింటినా ఎదుర్కొంటూ నాణ్యమైన కూరగాయలను పండించడం సంతృప్తినిస్తుందని, కొనుగోలుదారులు కూడా సంతృప్తి చెందుతు న్నారని తెలిపారు.



108 కళశాలతో మహిళల శోభాయాత్ర

వైభవంగా ప్రతిష్ఠా మహోత్సవాలు

భీమవరంటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : భీమవరం కిష్కిందాపురంలోని శ్రీసీతారామ లింగేశ్వర స్వామి నూతన దేవాలయ పునః ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం 108 మహిళలచే కలశాలతో ఊరేగింపు నిర్వహించారు. శ్రీస్వామి వారు, అమ్మవార్ల పరివార దేవతామూర్తుల విగ్రహాలతో సన్నాయి వాయిద్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఊరేగింపు ఆలయ ప్రాంగణం నుంచి పట్టణంలోని శ్రీమావుళ్ళమ్మ అమ్మవారి ఆలయం ప్రధాన వీధుల గుండా శోభాయమానంగా జరిగింది. జిల్లా దేవాదాయ శాఖ అధికారి సుబ్బారావు, ఈవో ఫణిరామ కిషోర్, ఈవో తోట శ్రీనివాస రావు, కంతేటి వెంకటరాజు, అల్లు శ్రీనివాస్, అర్చకులు ముువ్వ శివ, హనుమత్ పాల్గొన్నారు. అనంతరం విగ్రహాలకు, ధాన్యాదివాసం. పుష్పాదివాసం, జలాదివాసం చేశారు.

వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది సమస్యలు పరిష్కరించండి



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఏలూరు రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు, అసోసియేట్ అధ్యక్షుడు ఆర్కే శ్రీనివాసరావు తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఆయన ఛాంబర్‌లో ఐక్యవేదిక చైర్మన్ కె.సూర్యనారాయణతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కొత్తగా సచివాలయ వ్యవస్థలో హేతుబద్ధీకరణ పేరుతో జరుగుతున్న ప్రక్రియలో రాష్ట్రంలో పని చేస్తున్న 15వేల మంది గ్రేడ్ -1, గ్రేడ్ -2 వీఆర్వోలను రెవెన్యూ శాఖ పరిధిలోనే విధులు నిర్వహించేలా, బీడీవోగా తహసీల్దార్ ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు సుగుణ, మిర్యాల లక్ష్మీనారాయణ, ప్రసన్న, అప్పలనాయుడు, ఏ.ప్రభాకర్, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎన్నో జీవితాలను కథలుగా మార్చారు.. తందాన తాన తందనాన అంటూ బుర్రకథ రూపంలో ప్రజల చెంతకు తీసుకెళ్లారు.. ఆయన జీవితమూ ఒక కథే.. తరచి చూస్తే ఒక కన్నీటి జీవన ప్రయాణమే.. కళనే నమ్ముకుని ఏం సాధించారంటే పేరు తప్ప ఏం లేదు.. చివరి వరకూ కళనే నమ్ముకున్నారు.. ఆకలితో ఉన్నా ఆ కళను మాత్రం ఆపలేదు.. చివరి వరకూ అదే ఊపిరిగా జీవనయానం సాగించారు.. ఏదో ఒక రోజు తన కళ కడుపునింపక పోతుందా అంటూ ఎదురుచూశారు.. 76 ఏళ్ల జీవితంలో వెను తిరిగి చూస్తే వేల ప్రదర్శనలు.. అయితే ఆయన నమ్మ కమే నిజమైంది.. తన కళ కడుపునింపేటంత పద్మశ్రీ అనే బిరుదును తెచ్చింది.. అయితే ఆ ఆనందాన్ని పంచుకోవడానికి.. ఆ పురస్కారం అందుకోవడానికి మిరియాల అప్పారావు మన మధ్యన లేరు.. ఆయన కుటుంబ పరిస్థితులను 'ఆంధ్రజ్యోతి' పరిశీలించగా ఎన్నో ఆసక్తికర విషయాలు వెలుగుచూశాయి.

- (ఆంధ్రజ్యోతి/రావులపాలెం)

బుర్రకథ.. ఊపిరిగా..

మన పద్మశ్రీ మిరియాల అప్పారావు



కళ..కళ కోసం..ప్రజల కోసం.. అనే అన్వయం కచ్చితంగా బుర్రకథకు దక్కుతుంది. ఎందుకంటే మనకున్న జానపద కళారూపాల్లో హరికథ తర్వాత చాలా ముఖ్యమైన గాన ప్రక్రియ. మన తెలుగువాళ్లు ఈ కథా ప్రక్రియను ఎంత ప్రభావవంతంగా వినియోగించుకున్నారంటే జానపద, పౌరాణిక కథల నుంచి వీరోచిత ఉద్యమాలు, సామాజిక చైతన్య కార్యక్రమాల వరకు అత్యద్భుతంగా బుర్రకథ ఒదిగిపోయింది. ఇలా ఒదిగిపోవడానికి బుర్రకథా పితామహుడిగా షేక్ నాజర్ వేసిన పునాదులు అటువంటివి. ఆయనకు ప్రభుత్వం పద్మశ్రీ ఇచ్చి గౌరవించింది. అలనాటి బుర్రకథకుల్లో రావులపాలెంనకు చెందిన మరొక ఆణిముత్యం మిరియాల అప్పారావు. ఇటీవల మరణించిన ఆయనకూ పద్మశ్రీ ప్రకటించింది. ప్రభావంతమైన కథనంతోపాటు చతురతతో కూడిన హాస్యం, వినోద సంభాషణలతో రాగయుక్తమైన విన్యాసాల మధ్య సాగే బుర్రకథ... కొన్ని దశాబ్దాలపాటు తిరుగులేని కళగా చరిత్ర సృష్టించింది. దీనికి కారణం ఒక నాజర్.. ఒక మిరియాల.. ఇంకా ఎందరో..

ఇప్పుడు నాణేనికి రెండో వైపు చూద్దాం. దాదాపు అయిదు దశాబ్దాలపాటు బుర్రకథే ప్రాణంగా మిరియాల అప్పారావు చివరి వరకు అదే తపనతో జీవించారు. ఇక్కడ మరొక ఆసక్తికరమైన విషయమేమిటంటే.. ఆయన కుటుంబం యావత్తూ ఇదే రంగంలో ఉండి జీవనం సాగిస్తుండడం. కాకపోతే వేలాది ప్రదర్శనలు ఇచ్చిన కళాకారుల కుటుంబాలు ఏ స్థాయిలో ఉన్నాయో చూద్దామని ప్రయత్నిస్తే చాలాసార్లు మనకు నిరాశే ఎదురవుతుంది. దానికి కారణం ఆ కళనే నమ్ముకుని, ముందు తరం వారసులుగానే తమ జీవితాలను కొనసాగించడానికి వారు శక్తినంతా ధారపోయడమే ఒక శాపమవుతోంది. ఈ నేపథ్యంలో వీరి కృషి కళారంగానికి ఎనలేని సేవ అనాలా.. కళనే నమ్ముకుని తమ 'భవిష్యత్తు'ని ధారపోసిన త్యాగమూర్తులనాలా..

ఇంటిల్లపాదీ బుర్రకథకులే..

కళను నమ్ముకుని ఎన్నో ప్రదర్శనలు ఇస్తూ గుర్తింపు తెచ్చుకున్న బుర్రకథ కళాకారులకు ఇవాళ ఆదరణ లేదు. కేవలం సామాజిక చైతన్య కార్యక్రమాల కోసమే ఈ కళారూపం అన్నట్టుగా మారిపోయింది. ఒక కుటుంబం ఐదు దశాబ్దాలపాటు బుర్రకథ కళారంగంలోనే జీవితం సాగించింది. ఒకరిద్దరు కాదు, ఇంటిల్లపాదీ ఇదే రంగానికి తమ జీవితాలను అంకితం చేసింది. యజమాని నుంచి కూతుర్లు, కొడుకులూ అందరూ ఇదే జీవనం. 50 ఏళ్లుగా.. వేలాది ప్రదర్శనలు.. సత్కారాలు, ప్రశంసలు, బిరుదులు.. హోరెత్తిన జనం చప్పట్లు..



కుటుంబంతో మిరియాల అప్పారావు (ఫైల్)

చిన్న డాబా ఇల్లే ఆస్తి

76 ఏళ్ల కళాప్రయాణం.. వేల ప్రదర్శనలు.. ఆయనకు ఉన్నది మాత్రం రావులపాలెంలో పార్కు వద్ద 4 సెంట్లు అంటే అంటే సుమారు 200 గజాల స్థలం.. ఆ స్థలంలోనే సుమారు 30 ఏళ్ల కిందట కట్టిన రెండు పోర్షన్ల చిన్న డాబా ఇల్లు.. అదే ఆస్తి.. ప్రస్తుతం ఆ చిన్న ఇంటిలోనే మిరియాల అప్పారావు నలుగురు కుమారులు సుమారు 20 మంది కుటుంబీకులు నివాసం ఉంటున్నారు.. తండ్రి వారసత్వంగా వచ్చిన బుర్రకథ కళనే నమ్ముకుని జీవనం సాగిస్తున్నారు.. ప్రభుత్వం తమను ఆర్థికంగా ఆదుకోవాలని కుటుంబీకులు వేడుకుంటున్నారు.

స్మృతిచిహ్నం ఏర్పాటుచేయాలి

అంతటి కళాకారుడు తమ మధ్యన తిరగడం అదృష్టం అంటున్నారు రావులపాలెం ప్రజలు.. ఆయన స్మృతి చిహ్నం ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. ఆయన ఇంటి చెంతనే ఉన్న పార్కులో మిరియాల అప్పారావు విగ్రహం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

వాస్తవ కథ విందాం...

మిరియాల అప్పారావు. ఈయనది కాకినాడ జిల్లా నడకుదురు. 1949లో మిరియాల వెంకట రామయ్య, తిరుపతమ్మలకు జన్మించారు. 1969లో బుర్రకథపై ఉన్న ఆసక్తితో ఇందులో అరం గ్రేటం చేశారు. డ్రాయింగ్ మాస్టర్ జూనియర్ నాజర్, రామిశెట్టి వీరేశం దగ్గర శిష్యరికం చేశారు. 1974లో ఆలిండియా రేడియోలో, 1994లో దూరదర్శన్‌లో ఇచ్చారు. 1975లో పెద్దాపురంలో నిర్వహించి బుర్రకథ పోటీల్లో ప్రథమస్థానం సాధించి 50 తులాల వెండి కప్ గెలుచుకున్నారు. 5వేలకు పైగా స్టేజీ ప్రోగ్రామ్‌లు, 365 రోజుల్లో 300 రోజులు బుర్రకథ ప్రదర్శనలతో రికార్డు సాధించారు. భార్య నాగమణితో పాటు తన ఏడుగురు సంతానంతో కలిసి బుర్రకథలను చెబుతూ వచ్చారు. అంతే కాకుండా షణ్ముఖ ఆంజనేయరాజుతో కలిసి పలు నాటకాల్లోనూ నటించారు. కళారంగంలో ఆయన ప్రతిభను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం అప్పారావుకు పద్మశ్రీ అవార్డును ప్రకటించింది. పద్మశ్రీ ప్రకటించే సమయానికి ఆయన మరణించడం, ప్రకటించిన రోజు దశదినకర్మ రావడం కుటుంబ సభ్యులను కొంత ఆవేదన కలిగించినప్పటికీ ఆయనకు గుర్తింపు రావడం అవి..సంతోష క్షణాలే..

ఇదీ కుటుంబ నేపథ్యం..

పద్మశ్రీ అవార్డు దక్కించుకున్న మిరియాల అప్పారావుకు భార్య నాగమణి, నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. సుబ్బరాజు, బ్రహ్మజీ, మిరియాల సిద్ధయ్య, బాబా, వీరనాల పద్మావతి, వీరనాల లలిత, యడవల్లి శ్రీదేవి. వీరిలో శ్రీదేవి తాడేపల్లిగూడెంలో ఉండగా మిగిలిన వారంతా రావులపాలెంలోనే ఉంటున్నారు. అప్పారావు తన 50 ఏళ్ల ప్రస్థానంలో 25 ఏళ్ల కిందట రావులపాలెంలో సొంతింటిని నిర్మించారు. ప్రస్తుతం ఆ ఇంటిలోనే నలుగురు కుమారులు తమ కుటుంబాలతో ఉండడం విశేషం.

చివరి కోరిక ఇదే..

ఆయన ధ్యాస.. శ్వాస బుర్రకథ.. అందుకే చివరి కోరిక కూడా అదే.. బుర్రకథను నలుగురికీ నేర్పించాలన్నది ఆయన చివరి కోరిక. తరచూ కుమారులకు అదే చెబుతుండే వారట.. ఆ కోరిక తీరకుండానే మరణించారు.. బుర్రకథకు ఆదరణ తగ్గిన నేపథ్యంలో ఆ అవకాశమూ రాలేదు.. ప్రభుత్వం ఆ అవకాశం తమకు కల్పించాలని కుమారులు కోరుతున్నారు.. ప్రభుత్వం సహకరిస్తే బుర్రకథ కళను నలుగురికి నేర్పించి.. తమ తండ్రి చివరి కోరిక తీర్చుతామని చెబుతున్నారు.. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సహకరించాలని వేడుకుంటున్నారు.

ప్రజలకు ఉత్తమ సేవలందించాలి

పోలీస్ స్టేషన్ రైటర్లకు శిక్షణలో ఎస్పీ కిశోర్


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్పీ కిశోర్

పెదవేగి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రజలు న్యాయం కోసం ఎంతో నమ్మకంతో పోలీస్ స్టేషన్‌కు వస్తారని, ఉత్తమ సేవలందించి వారి నమ్మకాన్ని నిలబెట్టాలని ఏలూరు జిల్లా ఎస్పీ కె.ప్రతాప్ శివకిశోర్ అన్నారు. స్టేషన్‌కు వచ్చే వారిని మర్యాదగా పలకరించి, వారి సమస్యలపై సానుకూలంగా స్పందించాలని సూచించారు. జిల్లాలోని 36 మంది స్టేషన్ రైటర్లకు పెదవేగిలోని జిల్లా పోలీస్ శిక్షణ కేంద్రంలో మూడు రోజుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో గురువారం ఎస్పీ కిశోర్ మాట్లాడారు. ఆధునిక యుగంలో పోలీసుల విధి నిర్వహణ సవాళ్లతో కూడుకుని ఉందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని విధులు నిర్వర్తిస్తే మరింత మెరుగైన సేవలు అందించవచ్చని సిబ్బందికి సూచించారు. ఎస్‌హెచ్‌వో తర్వాత రైటర్లది ప్రధాన పాత్ర అని, వారికి ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. రైటర్ల అనుసరించే విధానంపైనే స్టేషన్ ప్రతిష్ఠ ఆధారపడి ఉంటుందన్నారు. ఫిర్యాదుదారులతో నడుచుకునే విధానంపైనే రైటర్ల సమర్థత ఆధారపడి ఉంటుందని ఎస్పీ తెలిపారు. కేసుల విచారణలో సీసీటీవీల ప్రాధాన్యత, వాటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డీటీసీ ప్రిన్సిపాల్, జిల్లా ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు మాట్లాడుతూ రైటర్లకు ఆధునిక, సాంకేతిక విధానాలపై శిక్షణ ద్వారా మరింత మెరుగైన సేవలు అందించగలమన్నారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రైటర్లకు ప్రశంసా పత్రాలు అందించారు. డీటీసీ డీఎస్పీ సీహెచ్.జీవీ.ప్రసాద్, సీఐ రామారావు, పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ, డీటీసీ ఎస్ఐలు ఎస్.శ్రీనివాసరావు, విజయకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

లెక్క తేల్చండి..!



విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్యలో పొంతన లేని వివరాలు

ఐదు రకాల బడుల ఖరారుపై అధికారుల కసరత్తు.. నేడు ఎంఈవోలతో సమావేశం

ఏలూరు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ యూనిట్‌గా ఐదు రకాల బడుల ఖరారుపై అధికారులు ఖరారు చేయడానికి కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే సేకరించిన పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య వివరాల్లో తేడా గుర్తించారు. సరిగా లెక్క తేల్చాలని, ఈమేరకు ఎంఈవోలతో సమావేశం ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. వివరాల సేకరణపై పలు సందేహాలు, సందిగ్ధ నేపథ్యంలో సవరణలు అనివార్యమని సంకేతాలు వస్తున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఆరుబడుల విధానంతో క్షేత్రస్థాయిలో విద్యా విధ్వంసానికి గురైంది. ఆ మేరకు జీవో 117 ఉత్తర్వులను కూటమి ప్రభుత్వం రద్దుచేసిన విషయం తెలిసిందే. ప్రత్యామ్నాయంగా క్లస్టర్ విధానాన్ని ప్రతిపాదిస్తూ పంచాయితీ యూనిట్‌గా ఐదు రకాల బడుల విధానానికి శ్రీకారం చుట్టింది. జగన్ ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతులను విడదీసి, వాటిని హైస్కూల్, ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేయగా, తాజాగా ప్రతిపాదించిన ఐదు రకాల బడుల విధానంలో ఉన్నత పాఠశాలల్లోకి గతంలో విలీనంచేసిన ప్రాథమిక తరగతులను మళ్లీ వెనక్కి తెచ్చి పూర్వ విధానంలోనే ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు ఒకే చోట నిర్వహించేలా కొత్తగా మోడల్ ప్రైమరీ స్కూల్ విధానానికి తెరతీశారు. కొత్తగా ప్రతిపాదించిన మోడల్ ప్రైమరీ, బేసిక్ ప్రైమరీ, ఫౌండేషనల్ స్కూళ్లను ప్రారంభించేందుకు ప్రస్తుతం నడుస్తోన్న పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, టీచర్ల సంఖ్య, మౌలిక వసతులు తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో తనిఖీ చేయించి వివరాలు సేకరించారు. మండలాలవారీగా ఎంఈవోలు అందజేసిన సమాచారాన్ని క్రోడీకరించి నివేదికను సిద్ధం చేశారు. దీనిపై తాజాగా సమీక్షించిన పాఠశాల విద్య ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ సరిగా జరగలేదని గుర్తించారు. దీనికి పలు లోపాలను ఉదహరించారు. తక్షణమే వాటిని సరిదిద్ది మలివిడత నివేదికను శుక్రవారమే పంపాలని ఆదేశించారు.

లేవనెత్తిన అభ్యంతరాలివే..

ఐదు రకాల బడుల విధానంలో ఏలూరు జిల్లాలో 592 పంచాయితీల్లో సుమారు 310 మోడల్ ప్రైమరీ స్కూళ్లు, సుమారు 900 బేసిక్ ప్రైమరీ స్కూళ్లు, దాదాపు 246 ఫౌండేషనల్ స్కూళ్లు ఏర్పాటుచేయడానికి అవకాశం ఉందని ప్రాథమికంగా నివేదించారు. వాస్తవానికి ప్రస్తుతం నడుస్తోన్న ప్రాథమిక పాఠశాలల్లో సుమారు 80శాతం పాఠశాలలను ఎల్‌కేజీ, యూకేజీ, ఒకటో తరగతి, రెండో తరగతిలతోపాటు అవసరమైనచోట 3, 4, 5 తరగతులను కూడా కొనసాగించేలా ఏర్పాటు చేయాలన్నది విద్యాశాఖ యోచన. దీనికనుగుణంగా క్షేత్రస్థాయిలో ఎంఈవోల పరిశీలన, తనిఖీలు సరిగా జరగలేదని భావిస్తున్నారు. ముఖ్యంగా తరగతులు, పాఠశాలల వారీగా జిల్లా విద్యా శాఖ వద్ద ఎన్‌రోల్‌మెంట్‌కు, రాష్ట్రస్థాయిలో జిల్లాలవారీగా యుడైస్ ఎన్‌రోల్‌మెంట్ మధ్య భారీ వ్యత్యాసం ఉన్నట్లు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్‌రోల్‌మెంట్‌కు కటాఫ్ డేట్ గతేడాది డిసెంబరు 31 తీసుకోకుండా డేటాను రూపొందించారని తెలుస్తోంది. కొన్ని మండలాల్లో ఎంఈవోలు ప్రత్యక్ష పరిశీలన చేయకుండా డేటా ఎంట్రీ ఆపరేటర్లపై ఆధారపడి ఐదురకాల బడుల సంఖ్యను నిర్ధారించారనే అనుమానాలు ఉన్నాయి. దీనికి అనుగుణంగానే పాఠశాలలవారీగా ఉపాధ్యాయుల శాంక్షన్, వర్కింగ్ పోస్టుల డేటా కూడా సరిగా తీసుకోలేదని సమాచారం. వీటన్నింటినీ పునఃపరిశీలించి, మళ్లీ నివేదికను తయారుచేసేందుకు శుక్రవారం జిల్లాలోని ఎంఈవోలందరితో ఏలూరులో డీఈవో వెంకటలక్ష్మమ్మ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఇపుడున్న ఐదురకాల బడుల సంఖ్య ప్రతిపాదనల్లో కొత్తగా మోడల్, బేసిక్ ప్రైమరీ, ఫౌండేషనల్ స్కూళ్ళు మారే అవకాశాలే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

ముగిసిన తొలి విడత జేఈఈ మెయిన్స్


సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో విద్యార్థులను పరిశీలిస్తున్న సిబ్బంది

ఏలూరు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ తొలి విడత పరీక్షలు గురువారం ముగిశాయి. చివరి రోజు బీఆర్క్, బీప్లానింగ్ పరీక్షలకు ఏలూరు జిల్లాలో సిద్ధార్థ క్వెస్ట్ స్కూలు పరీక్ష కేంద్రంలో 180మంది విద్యార్థులకు 138 మంది, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కేంద్రంలో 100 మందికి 70 మంది, సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో 118మందికి 107మంది హాజరయ్యారు. ఈ నెల 22న ప్రారంభమైన పరీక్షలను డీఈవో వెంకటలక్ష్మమ్మ, ఆర్డీవో అంబరీష్ తదితరులు పర్యవేక్షించారు. జిల్లాలో మొత్తం 3497మంది విద్యార్థులకు 3348 మంది పరీక్షలకు హాజరయ్యారు. ఏప్రిల్‌లో జరుగనున్న మలివిడత జేఈఈ మెయిన్ పరీక్షల షెడ్యూల్‌ను ప్రకటించాల్సి ఉంది.

● భీమవరం రూరల్: భీమవరం పట్టణంలో డీఎన్నార్ డిగ్రీ కళాశాలలో జేఈఈ మెయిన్స్ 2025 తొలి విడత పరీక్ష గురువారం ప్రశాంతంగా జరిగింది. వంద మంది విద్యార్థులకు 89 మంది విద్యార్థులు పరీక్షకు హాజరై 11 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

విద్యార్థులు కృత్రిమ మేధస్సుపై పట్టు సాధించాలి

» నిట్ వరంగల్ ప్రొఫెసర్ వెంకటకృష్ణ

పెంటపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ కృత్రిమ మేధస్సుదేనని, విద్యార్థులు కృత్రిమ మేధస్సుపై పట్టు సాధించాలని వరంగల్ నిట్ సీఎస్ఈ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ వెంకటకృష్ణ అన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ.రమణారావు, రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్‌శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంస్థ ఇన్నోవేషన్ ఇంక్యూబేషన్ సెంటర్ సహకారంతో జనరేటివ్ ఏఐ అంశంపై విద్యార్థులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్, అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీఫణికృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వెంకటకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్త సాంకేతికత ఆవిష్కృతం అవుతుందన్నారు. కంపెనీలు, పరిశ్రమలు, సంస్థలలో కృత్రిమ మేధ సాంకేతిక పరిజ్ఞానం అవసరం, వినియోగం రోజురోజుకు పెరుగుతుందన్నారు. అందుకు తగ్గట్టుగానే కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తున్నాయన్నారు. విద్యార్థులు వాటిని అందిపుచ్చుకుని ఉన్నత స్థానాలకు ఎదగాలన్నారు. ఏపీ నిట్ డీన్ రీసెర్చ్, కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కే.శాస్త్రి మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు, మిషన్ లెర్నింగ్ వంటి నూతన సాంకేతికతలపై విద్యార్థులు పట్టు సాధించాలని, సమాజహిత అవసరాలకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు డాక్టర్ కార్తికేయ శర్మ, డాక్టర్ పి.శంకర్, డాక్టర్ నగేష్‌భట్టు తదితరులు పాల్గొన్నారు.


పార్కును పరిశీలిస్తున్న భరత్, కెనరా బ్యాంకు సీఈవో సత్యనారాయణరాజు, నేతలు

పార్కు అభివృద్ధికి కెనరా బ్యాంక్ రూ.50 లక్షల విరాళం

ఆకివీడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గం అభివృద్ధికి ఉప సభాపతి కనుమూరి రఘురామకృష్ణరాజు చేస్తున్న కృషి అభినందనీయమని కెనరా బ్యాంకు సీఈవో కలిదిండి సత్యనారాయణరాజు అన్నారు. సామాజిక ఆరోగ్య కేంద్ర పక్కన ఆర్ఆర్ఆర్ బృందావనం పార్కును ఆర్ఆర్ఆర్ తనయుడు భరత్‌తో కలిసి గురువారం ఆయన పరిశీలించారు. కెనరా బ్యాంక్ సామాజిక బాధ్యత నిధుల నుంచి సుమారు రూ.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. పార్కులో వాకింగ్ ట్రాక్, షెటిల్ కోర్టు, యోగా, ధ్యానం ఏర్పాట్లతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు, గొంట్లా గణపతి, నౌకట్ల రామారావు, గంధం ఉమా, జనసేన పట్టణ అధ్యక్షుడు పిల్లా బాబులు, ఇంజనీర్ దాసరి సత్యనారాయణ, మోటుపల్లి సత్యనారాయణ, చిరంజీవి సత్యనారాయణ, బత్తుల రవి తదితరులు ఉన్నారు.

అబ్బాయిరాజు పార్కు పరిశీలన

ఉండి: ఉండిలోని కలిదిండి అబ్బాయిరాజు పార్కును చూసిన ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణంరాజు కుమారుడు భరత్ గురువారం పరిశీలించారు. ఆర్ఆర్ఆర్, దాతల సహకారంతో ఉండి పార్కును అభివృద్ధి చేసిన పార్క్‌ను పరిశీలించిన ఆయన ఆనందం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులను ప్రణాళికతో చేపట్టి పూర్తిచేస్తామన్నారు. డీసీ చైర్మన్ తోట ఫణిబాబు, వైస్ చైర్మన్ మంతెన సాయిలచ్చిరాజు, తోట రాము, పొత్తూరి వెంకటేశ్వరరాజు, జివిసత్యనారాయణ, వేగేశ్న సత్యనారాయణరాజు, కునుకు శ్రీను, పోలుబోతు రాము, కర్రి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


చెక్కపల్లిలో విలేకర్లతో మాట్లాడుతున్న స్వయం సహాయక సంఘాల మహిళలు

చెక్కపల్లి భవిత గ్రామైక్య సంఘంలో అవకతవకలు

బుక్ కీపర్‌ను తొలగించిన అధికారులు

ముసునూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): చెక్కపల్లి భవిత గ్రామైక్య సంఘంలో అవకతవకలు జరగడంతో అధికారులు బుక్ కీపర్‌ను తొలగించారు. గురువారం వివిధ గ్రూపులకు చెందిన డ్వాక్రా మహిళలు విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామైక్య సంఘం ప్రెసిడెంట్ జోలా శిరీషతో పాటు గ్రూపుల అధ్యక్షులు మాట్లాడుతూ భవిత గ్రామైక్య 46 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయని ఈ సంఘాలకు బుక్‌కీపర్‌గా ఉన్న దోమతోటి మార్త శ్రీనిధి రుణాలు తీసుకోకపోతే ఇతర రుణాలు ఇవ్వడం కురదని, బెదిరింపులకు పాల్పడి సభ్యులకు తెలియకుండా రుణాలు తీసుకుందని ఆరోపించారు. సభ్యులు తీసుకున్న రుణాలకు రికవరీ నగదును సైతం బ్యాంకుకు చెల్లించకపోవడంతో నెలల తరబడి నగదు కడుతున్నా బాకీ అలాగే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతి, సీఐఎఫ్ రుణాలను సైతం గ్రూప్ సభ్యుల సంతకాలను ఫోర్జరీ చేసి రుణాలను తీసుకుని అక్రమాలకు పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను గర్భిణిగా ఉన్నప్పుడు 46 ఖాళీ చెక్కులపై సంతకాలు చేయించుకుని మాకు తెలియకుండా నగదును డ్రా చేసుకుందని శిరీష ఆరోపించారు. బుక్‌కీపర్ మార్త తన సొంత గ్రూప్‌లోనే సభ్యులకు తెలియకుండా రూ.10 లక్షలు రుణాలు తీసుకుందన్నారు. మొత్తం 46 గ్రూపుల్లో సూమారు రూ.40 లక్షల వరకు అవకతవకలు జరిగాయని ఆరోపించారు. బుక్‌కీపర్‌గా మార్తను తొలిగించినా గ్రామైక్య సంఘంపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేయాలని కోరారు.

ఏజెన్సీలో భగ్గుమన్న భూవివాదం

» గుడిసెలు వేసుకున్న గిరిజనులు
» తొలగించేందుకు గిరిజనేతరుల యత్నం
» రోడ్డుపై బైఠాయించిన నేతలు
» స్టేషన్‌కు తరలించిన పోలీసులు


సీపీఎం నేత రామకృష్ణను అరెస్టు చేస్తున్న పోలీసులు, అడ్డుకుంటున్న గిరిజన మహిళలు

బుట్టాయగూడెం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన, గిరిజనేతరుల మధ్య మరోసారి భూవివాదం భగ్గుమంది. గిరిజన పేదలు గుడిసెలు వేసుకున్న భూమి ప్రభుత్వ పోరంబోకు అని గిరిజనులు వాదిస్తున్నారు. తమ వద్ద భూమికి సంబంధించిన పక్కా ఆధారాలు ఉన్నాయంటూ గిరిజనేతరులు చెబుతున్నారు. మండల కేంద్రంలోని 550/4, 550/5, 550/6 సర్వే నెంబరులో సుమారు 3 ఎకరాల భూమి పుంత పోరంబోకు భూమి అంటూ 70 మంది ఆదివాసీ గిరిజనులు సుమారు 20 రోజుల క్రితం గుడిసెలు వేశారు. గిరిజనులు ఆక్రమించిన భూమి తమదేనంటూ గిరిజనేతరుడు కరాటం సునీల్ మరికొందరు గిరిజనేతరులు చెబుతున్నారు. గురువారం పేదల గుడిసెలను గిరిజనేతరులు తొలగించే ప్రయత్నం చేస్తున్నారని తెలుసుకున్న సీపీఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ, కుంజా సత్యనారాయణ, పోలోజు నాగేశ్వరరావు, మొడియం నాగమణి ఆధ్వర్యంలో గిరిజనులు బుట్టాయగూడెం-కన్నాపురం రహదారిపై బైఠాయించారు. గిరిజనుల గుడిసెలను తొలగించిన కరాటం సునీల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేసి అరెస్టు చేయాలని నినాదాలు చేశారు. ఎస్సై డి.దుర్గా మహేశ్వరావు ఘటనా స్థలానికి చేరుకుని రోడ్డుపై ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించ వద్దని ఆందోళనకారులకు తెలిపారు. వారు వినకపోవడంతో తెల్లం రామకృష్ణ, కుంజా సత్యనారాయణను స్టేషన్‌కు తరలించారు. సంఘటనా స్థలం నుంచి ఇరువర్గాల వారిని ఎస్సై దుర్గా మహేశ్వరావు పంపించి వేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించుకోవాలని సూచించారు.

జనసేన నేతపై చింతమనేని అనుచరుల దాడి

» ఫిర్యాదు చేసి 3 రోజులైనా పట్టించుకోని పోలీసులు
» ఏలూరు పోలీస్ స్టేషన్ వద్ద నూజివీడు నేతల ఆందోళన


త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న జనసేన నాయకులు

ఏలూరు క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ నూజివీడు మండల అధ్యక్షుడు యర్రంశెట్టి రాముపై దాడి చేసిన ఎమ్మెల్యే చింతమనేని అనుచరులపై చర్యలు తీసుకోవాలని జనసేన నేతలు డిమాండ్ చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసి మూడు రోజులైనా ఎందుకు చర్యలు తీసుకోలేదని పోలీసులను ప్రశ్నించారు. ఏలూరు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద గురువారం బైఠాయించి నినాదాలు చేశారు. ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన అధికార ప్రతినిధి శివరామకృష్ణ మాట్లాడుతూ ఈనెల 28న దుగ్గిరాలలో జనసేన నూజివీడు మండల అధ్యక్షుడు యర్రంశెట్టి రాముపై దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరులు దాడి చేశారన్నారు. రాము కౌలుకు తీసుకున్న చెరకు తోటలో పనిచేసుకుంటుండగా దాడి చేసి దుర్భాషలాడారన్నారు. రాము దాడి విషయాన్ని పసిగట్టి త్రీ టౌన్ సీఐకు ఫోన్ చేసి రక్షణ కల్పించాలని కోరినా పోలీసులు చర్యలు తీసుకోలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత చింతమనేని ఆరాచకాలు పెరిగాయన్నారు. రామును ఇబ్బంది పెడుతున్నారని లోకేశ్, జనసేన కేంద్ర కార్యాలయానికి దృష్టికి తీసుకువెళ్లామన్నారు. కలెక్టర్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేశారన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ రాముపై త్రీ టౌన్‌లో కేసు పెట్టించారన్నారు. అవమానించినా తట్టుకున్నాం, మీటింగ్‌లకు పిలవకపోయినా తట్టుకున్నాం కానీ భౌతికంగా దాడులు చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, నిందితులను తక్షణమే అరెస్టు చేసి చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితుడు రాము మాట్లాడుతూ 2014 నుంచి దుగ్గిరాల సమీపంలో పొలాన్ని కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నానన్నారు. 28న చెరుకు నరికిస్తుంటే చింతమనేని అనుచరులు కూలీలను బెదిరించారని, చింతమనేనిపై పోస్టులు పెడతావా అంటూ తనపై దాడి చేశారన్నారు. తనలో ఉన్న మరో యువకుడి సెల్‌ఫోన్, తన సెల్‌ఫోన్, జేబులో ఉన్న రూ.7 వేలు కాజేశారని తెలిపారు. ప్రాణభయంతో పారిపోయామని, త్రీ టౌన్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకూ పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేసులు నమోదు

యర్రంశెట్టి రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు చింతమనేని గోపీ, వడ్లపట్ల బాబు, మధు, మరో ఇద్దరిపై ఏలూరు త్రి టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. దుగ్గిరాల గ్రామ వీఆర్వో తిరువీధుల శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు యర్రంశెట్టి రాముపై కేసు నమోదు చేసి త్రి టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఆన్‌లైన్ యాప్ పేరిట మోసం

పెదపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లో నగదు చెల్లించి వీడియోలు చూస్తే డబ్బులు వస్తాయని చెప్పడంతో రూ.18,200 నగదు కట్టి మోసపోయామని బాధితులు వాపోయారు. పెదపాడు మండలం అప్పనవీడు గ్రామానికి చెందిన గుజ్జు క్రీస్తుప్రకాశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం కృష్ణా జిల్లా, బాపులపాడు మండలం కానుమోలుకు చెందిన నవీన్‌కుమార్ ఫాస్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆర్‌సీసీ ఆన్‌లైన్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లో ఒకసారి రూ.18,200 చెల్లించి అందులో వీడియోలు చూడడం ద్వారా రూ.600 చొప్పున నగదు వస్తుందని నవీన్‌కుమార్ నమ్మబలికాడు. అతడి మాటలు నమ్మి సుమారు 29 మంది ఆర్‌సీసీ యాప్‌లో రూ.18,200 చొప్పున చెల్లించారు. నగదు చెల్లించిన తరువాత యాప్ నిలిచిపోయిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పెదపాడు ఎస్సై కట్టా శారద సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాడేపల్లిగూడెంలో చోరీ

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 29 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలో బుధవారం రాత్రి రెండు వేర్వేరు చోట్ల చోరులు దొంగతనానికి తెగబడ్డారు. పాతూరులోని మిద్దే వరప్రసాద్ కుటుంబంతో కలిసి బెంగళూరు వెళ్లడంతో దొంగలు ఇంటి తాళాలు పగలకొట్టారు. నాలుగు కాసుల బంగారం, రూ.80వేలు చోరీ చేసినట్టు బాధితులు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా ఎఫ్‌సీఐ కాలనీలో ఒక ఇంట్లో చోరిచేసేందుకు దుండగులు ప్రయత్నిస్తుండగా ఇంట్లోని వృద్ధురాలు కేకలు వేయడంతో దుండగులు పరారయ్యారు. ఈ మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యపై అనుమానంతో నరికేశాడు

» మఠంగూడెంలో దారుణ హత్య

లింగపాలెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భార్య ప్రవర్తనపై భర్తకు అనుమానం. కుటుంబంలో కలహాలు. ఈ నేపథ్యంలో భార్యను భర్త కత్తితో నరికి హతమార్చిన సంఘన లింగపాలెం మండలం మఠంగూడెంలో జరిగింది. మఠంగూడెం గ్రామానికి చెందిన జక్కంపూడి నాగమణి (40) గురువారం ఉదయం రక్తపు మడుగులో పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ రవీంద్ర నాయక్, ధర్మాజీగూడెం ఎస్ఐ వెంకన్న సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం నాగమణి, భర్త జక్కంపూడి మారేశ్వరరావు (మారియ్య) మధ్య కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. అతడు మద్యానికి బానిసయ్యాడు. బుధవారం రాత్రి గొడవపడి మద్యం మత్తులో వేటకొడవలితో భార్యను నరికి చంపినట్లు తెలిపారు. వారికి కుమారుడు కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలంలో క్లూస్ టీం వివరాలు సేకరించింది. కుమారుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ రవీంద్రనాయక్ తెలిపారు.

ప్రియురాలే కడతేర్చింది

» వివాహేతర సంబంధం నేపథ్యంలో వ్యక్తి హత్య

కాకినాడ క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నేపథ్యంలో ప్రియుడిని ప్రియురాలే కడతేర్చిన సంఘటన గురువారం కాకినాడలో చోటుచేసుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా పెనుగొండ మండలం సిద్ధాంతంకు చెందిన గుడాల చంద్రశేఖర్‌స్వామి (30) రావులపాలెంలో వ్యవసాయ కూలీగా పనిచేసేవాడు. అతనికి రావులపాలెంనకు చెందిన 25 ఏళ్ల మునిస్వామి లావణ్యతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్తా సహజీవనానికి దారి తీసింది. ఆమెకు అప్పటికే చిత్తూరు జిల్లాకు చెందిన బాలు అనే వ్యక్తితో వివాహమై ఇద్దరు పిల్లలు పుట్టాక విడిపోయారు. కాగా చంద్రశేఖర్ స్వామికి తెలియకుండా లావణ్య ఆర్టీసీ డ్రైవర్‌గా పనిచేసే మరొకరితో సహజీవనం చేస్తోంది. అతడితో కలిసి రెండు నెలల క్రితం కాకినాడలోని డెయిరీ ఫాం సెంటర్, స్వర్ణాంధ్రకాలనీలోని టిడ్కో ఇంటిని అద్దెకు తీసుకున్నారు. కాకినాడ ఇంటి అడ్రస్‌ను తెలుసుకుని చంద్రశేఖర్ స్వామి బుధవారం రాత్రి అక్కడికి వెళ్లాడు. అక్కడ లావణ్యతో ఘర్షణ పడ్డాడు. అలా తెల్లవారు జాము వరకు ఇద్దరి మధ్య తీవ్రస్థాయిలో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో విషయం ఇంతవరకు వచ్చాక తనను చంద్రశేఖర్ అంతం చేస్తాడని లావణ్య భావించింది. మసాలా దంచే ఇనుప అమన్ దస్తాతో చంద్రశేఖర్ తలపై బలంగా విచక్షణా రహితంగా మోదడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం లావణ్య పరారైంది. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు చంద్రశేఖర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడితండ్రి వెంకన్న ఫిర్యాదు మేరకు కాకినాడ పోర్ట్ సిఐ సునీల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


చెత్తలో పిచ్చిమొక్కల మధ్యన పడి ఉన్న గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలు

మన్నించు.. మహాత్మా..!

పిచ్చిమొక్కల్లో గాంధీజీ విగ్రహం

పాలకొల్లు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బ్రాడీపేట ఒకటో వీధి కుళాయి చెరువు రోడ్డు పక్కన పిచ్చి మొక్కల మధ్య మహాత్ముడి విగ్రహం పడి ఉంది. ఈప్రాంతంలో గతంలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో గాంధీజీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలు ఉండేవి. కుళాయి చెరువు విస్తరణలో పాఠశాలను బ్రాడీపేటలోని 2వ వీధికి మార్చారు. అప్పటి నుంచి గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలను పట్టించుకున్న వారే లేరు.


సంఘటనా స్థలంలో మృతదేహం

మోటార్‌సైకిల్‌ను ఢీకొన్న లారీ

కొయ్యలగూడెం వద్ద ప్రమాదం

అశ్వారావుపేట ఆర్ఎంపీ మృతి

కొయ్యలగూడెం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం రోడ్డులోని ఇటుకల బట్టీ వద్ద జాతీయ రహదారిపై మోటార్ సైకిల్‌ను లారీ ఢీకొనడంతో ఒకరు మృతి చెందారు. గురువారం ఉదయం జరిగిన ఈ ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రం అశ్వారావు పేట మండలం ఊట్లపల్లి గ్రామానికి చెందిన ఆర్ఎంపీ సాదుభక్త వత్సల కుమార్ (75) మృతి చెందాడు. ఎస్సై చంద్ర శేఖర్ తెలిపిన వివరాల మేరకు తూర్పుగోదావరి జిల్లా తాళ్ళపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామంలోని కుమారుడి ఇంటి నుంచి మోటార్ సైకిల్‌పై ఊట్లపల్లి బయల్దేరాడు. కొయ్యలగూడెం దాటి ఇటుకల బట్టి వద్దకు వెళ్లేసరికి వెనుక నుంచి లారీ ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.


ముసునూరు పోలీసుల అదుపులో ఉన్న బైక్‌లు

లోపూడిలో కోడి పందేలపై దాడి

40 ద్విచక్ర వాహనాలు స్వాధీనం

ముసునూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): లోపూడి శివారు మామిడితోటలో బుధవారం రాత్రి జరుగుతున్న కోడిపందేలపై ముసునూరు పోలీసులు దాడి చేశారు. ఎస్ఐ చిరంజీవి స్టేషన్‌లో సిబ్బంది, చాట్రాయి ఎస్ఐ రామకృష్ణ సహాయంతో కోడిపందేల శిబిరాన్ని చుట్టుముట్టారు. పందెంరాయుళ్ళు పరుగులు తీయడంతో పక్కనే ఉన్న మూడు ఎకరాల పొగాకు తోట ధ్వంసమైంది. మరికొంతమంది మామిడి చెట్లుకొమ్మలు తగిలి గాయపడ్డారు. ఈ దాడిలో 40 ద్విచక్ర వాహనాలు, 12 కోడిపుంజులు, రూ 42,400 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. గురువారం ఉదయం ట్రాక్టర్లపై బైక్‌లను స్టేషన్‌కు తరలించి, కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు. కోడి పందేలు నిర్వహణ ఎవరు చేస్తున్నారని పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం.

మెరుగైన విద్యాఫలితాలకే స్కూళ్ల పునర్వ్యవస్థీకరణ : కలెక్టర్

పెనుగొండ, జనవరి30 (ఆంధ్రజ్యోతి): మెరుగైన విద్యా ఫలితాలే లక్ష్యంగా పాఠశాలల పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నామని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. గురువారం పెనుగొండ నగరేశ్వర మహిషాసుర మర్దని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం విశ్రాంతి మండపంలో డీఈవో, ఆచంట నియోజకవర్గ మండల ఎంఈవోలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ద్వారా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా కృషి చేస్తామన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన అందించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులలో డ్రాప్‌అవుట్స్ పూర్తిగా అరికట్టడానికి ఈ నూతన విధానం ఉపయుక్తమన్నారు. గతంలో ఆరు కేటగిరిలుగా విభజించి ప్రతీ విద్యార్థికి నాణ్యమైన విద్యను అందిండమే లక్ష్యంగా పాఠశాలలో పునర్వ్యవస్థీకరణ ఉంటుందన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఈ.నారాయణ, పెనుమంట్ర, ఆచంట, పోడూరు, పెనుగొండ ఎంఈవోలు వై.లక్ష్మీనారాయణ, వి.నాగేశ్వరరావు, పి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఆలయాలకు దాతల సాయం అభినందనీయం : బొలిశెట్టి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఆలయాల నిర్మాణంలో దాతల సహకారం అభినందనీయమని ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని స్థానిక శేషమహల్ రోడ్డులో ఉన్న చిన్న ఆంజనేయ స్వామి ఆలయం వద్ద న్యాయవాది బండారు మనోహర్, అడపా పానకాలు, అడపా గిరి కుటుంబసభ్యుల ఆధ్వర్యంలో గురువారం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జితో కలిసి ఆయన ప్రారంభించారు. పట్టణంలోని సుబ్బారావుపేట పంచముఖ ఆంజనేయస్వామి ఆలయాన్ని నిర్మాణం చేసేందుకు కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఆలయ నిర్మాణానికి బండారు మనోహర్ 300 గజాల స్థలాన్ని ఇస్తున్నట్టు ప్రకటించగా ఎమ్మెల్యే బొలిశెట్టి, వలవల బాబ్జి, అమెరికాలో ఉంటున్న కడించర్ల గోపాలరావు రూ. లక్ష రూపాయల చొప్పున విరాళాలు ప్రకటించారు. పట్నాల రాంపండు, అడపా ప్రసాద్, గంధం సతీష్, పోతుల అన్నవరం, పాలూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇనుప ఊచలు వినియోగిస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మొగల్తూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : రూ.24 లక్షలకు తుప్పు అనే కథనంలో ఈనెల 28న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తకు హౌసింగ్ అధికారులు స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన జగనన్న కాలనీల నిర్మాణ లబ్ధిదారులకు తీసుకువచ్చిన ఊచలు లబ్ధిదారులు తీసుకోకపోవడంతో తుప్పుపట్టి నిరుపయోగంగా మారాయి అంటూ వచ్చిన వార్తకు జిల్లా గృహ నిర్మాణ అధికారులు స్థానిక అధికారుల నుంచి ఆరా తీశారు. సుమారు 40 టన్నులు ఇనుప ఊచలు ఎండకు ఎండుతూ వానకు తడుస్తున్నాయని గుర్తించిన అధికారులు జిల్లాలో ఎక్కడ అవసరం ఉంటే అక్కడకు ఊచలు తరలిందేందుకు జిల్లా అధికారులు ఆదేశించారని మండల ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ తిరుమాని ఫణీంద్ర తెలిపారు.

'చింతలపాటి మూర్తిరాజు సేవలు చిరస్మరణీయం'

పెంటపాడు, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : విద్యాదాత చింతలపాటి మూర్తిరాజు సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. పరిమెళ్ళ జడ్పీ ఉన్నత పాఠశాల వ్యవస్థాపకుడు చింతలపాటి మూర్తిరాజు విగ్రహాన్ని విశ్రాంత హెచ్‌ఎం కనుమూరి సుబ్బరాజు సహకారంతో పాఠశాల ప్రాంగణంలో గురువారం ఆవిష్కరించారు. తొలుత గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జిల్లా సర్వోదయ మండల ప్రధాన కార్యదర్శి ఇంగుకూరి ప్రసాద రాజు, కార్యదర్శి సాగిరాజు జానకిరామరాజు, ఉపసర్పంచ్ ఇందుకూరి నాగరాజు, హెచ్‌ఎం కాంతిశ్రీ, మొకమాట్ల నాగదేవి, సుంకర ఏసు, విశ్రాంత ఎంఎఈవో రామరాజు పాల్గొన్నారు.

'సమన్వయంతో పనిచేసి దాళ్వాను గట్టెక్కిద్దాం'

నరసాపురం రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : తీరంలో దాళ్వా పంటకు నీటి ఎద్దడి తలెత్తకుండా అధికారులు, నీటి సంఘాలు సమన్వయంతో పనిచేసి రైతులకు నీటి సమస్య లేకుండా చేద్దామని ఇరిగేషన్ డీఈ వెంకటనారాయణ అన్నారు. గురువారం ఇరిగేషన్ కార్యాలయం వద్ద నరసాపురం, పాలకొల్లు నీటి సంఘాల అధ్యక్షులు, డీసీలకు వంతులవారీ విధానంపై అవగాహన కల్పించారు. శనివారం నుంచి డెల్టాలో వంతులవారీ విధానాన్ని అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం నుంచి ఫిబ్రవరి ఏడో తేదీ వరకు కవిటం, పి.పోలవరం, జిన్నూరు, వేడంగి, పాలకొల్లు, నరసాపురం మండలం మల్లవరం, లంక, కొప్పర్రుఛానల్స్ పరిధిలోని రైతులకు వంతులపై అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా నీటిఎద్దడి ఉంటే సాగునీటి సంఘాలకు తెలపాలన్నారు. అనంతరం సంఘం సభ్యులు డీఈ, ఏఈ మోహన్‌కృష్ణలను ఘనంగా సత్కరించారు. నీటి సంఘం అధ్యక్షులు పులఖండం వీరరాఘవులు, కుక్కల సత్యనారాయణ, కత్తుల శ్రీను, టీసీలు పాల్గొన్నారు.

కుష్టువ్యాధిగ్రస్తులపై ప్రేమానురాగాలు పంచాలి

గణపవరం/కాళ్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కుష్టువ్యాధి అంటువ్యాధి కాదని వారిపై ప్రేమానురాగాలు పంచాలని పీఎంపీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఏఆర్‌కే.పరమేశ్వర్లు అన్నారు. గురువారం కాశిపాడులో ప్రపంచ కుష్టువ్యాధి నివారణ దినోత్సవాన్ని క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం కుష్టువ్యాధిగ్రస్థులకు ఉచితంగా మందులు, పండ్లు పంపిణీ చేశారు. మాజీ ఎంపీటీసీ పి.అజయ్‌కుమార్‌రాజు, పంచాయతీ కార్యదర్శి జాషువ పాల్గొన్నారు. కాళ్ల మండలం కాళ్ళ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మండల వైద్యాధికారి డాక్టర్ ఎస్.సునీల్ అధ్యక్షతన గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13వరకు గ్రామాల్లో కుష్టువ్యాధిపై అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు.

'ఇస్రో శాస్త్రవేత్తల ఘనత అద్వితీయం'

భీమవరంటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఇస్రో చేపట్టిన వందో ప్రయోగం వండర్‌ఫుల్‌గా విజయవంతమైందని ఇస్రో శాస్త్రవేత్తలు సాధించిన ఘనత అద్వితీయమని భీమవరం డీఎన్నార్ కళాశాల అధ్యక్షుడు గోకరాజు వెంకట నరసింహరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, ఇంజనీరింగ్ కళాశాల ఈసీఈ డిపార్ట్‌మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో ఇస్రో విజయవంతంపై హర్షం తెలుపుతూ శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అంజన్‌కుమార్ మాట్లాడుతూ 19 నిమిషాల్లోనే కక్ష్యలోకి నావిక్-02వెళ్లిందన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ శాస్త్రవేత్తలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈసీఈ విద్యార్థులు మౌనిక, ఎ.జ్యోతిప్రకాష్ మాట్లాడారు. ఈసీఈ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ కె.వేణుగోపాల్, ఎస్.రవిచంద్ర, కె.శేఖర్‌బాబు, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ వి.ప్రవీణ్ పాల్గొన్నారు.

వైటీ రాజా కుటుంబ సభ్యులకు ఆరిమిల్లి పరామర్శ


రాజేశ్వరిదేవి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆరిమిల్లి

తణుకు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : తణుకు మాజీ ఎమ్మెల్యే వైటీ రాజా మాతృమూర్తి యలమర్తి రాజేశ్వరిదేవి మృతి చెందిన కారణంగా గురువారం ఆమె చిత్రపటానికి ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు వై.టి.రాజా కుమారుడు అవినాష్‌బాబు, ప్రముఖ సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్‌బాబులను పరామర్శించారు. రాజేశ్వదేవి ఆత్మకు శాంతి చేకూరాలని కోరారు.

ఉప్పుగుంట సమీపంలో ఆక్రమణల తొలగింపు


ఉప్పుగుంట సమీపంలో ఆక్రమణలు తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఉండి, జనవరి30 (ఆంధ్రజ్యోతి) : ఉండి మండలంలోని ఆక్వాచెరువులు, మంచినీటి చెరువులు వద్ద ఆక్రమణలకు గురైన వాటిని తొలగింపు పనులను చేపట్టినట్టు ఉండి డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్, వైస్‌ఛైర్మన్లు తోట ఫణిబాబు, మంతెన సాయిలచ్చిరాజు తెలిపారు. గురువారం ఉప్పుగుంట-కవిటంపాక పరిధిలోని ఆక్వా చెరువుల వద్ద వున్న ఆక్రమణలను తొలగించారు. వారు మాట్లాడుతూ ఉప సభాపతి ఆదేశాలతో వాటిని తొలగించామన్నారు. ఆక్వారైతులు, రైతులు, ప్రజలు సహకరించాలని కోరారు. ఉండి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కనుమూరు రఘురామ కృష్ణరాజు నిర్ణయం మేరకు ప్రత్యేకంగా తీసుకున్న చర్యలకు కట్టుబడి పనిచేయాలని సూచించారు. నీటి సంఘాల నాయకులు, పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఏడుగురు ముద్దాయిల బైండోవర్

ఆచంట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పాలకొల్లు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఆచంట మండలానికి చెందిన పాత బెల్టు కేసుల్లో పట్టుబడిన ఏడుగురు పాత ముద్దాయిలను బైండోర్ చేశామని పాలకొల్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మద్దాల శ్రీనివాస్ తెలిపారు. పాత ముద్దాయిలు కె.శ్రీనివాస్, కె.మసేనురావు, పి.భగత్‌సింగ్, పి.ప్రసన్నకుమార్, యు.శ్రీనివాస్, జి.బాలాజీ, పి.వెంకటేశ్వరరావులను ఆచంట తహసీల్దార్ ముందు ముందస్తుగా నేర నివారణకుగాను సంవత్సరం కాలమునకు బైండోవర్ చేసినట్టు తెలిపారు.


పాలకొల్లులో గాంధీ విగ్రహం వద్ద వాసవీ క్లబ్ సభ్యుల నివాళులు


భీమవరం మునిసిపాల్టీలో గాంధీ విగ్రహం వద్ద అధికారుల నివాళులు


తాడేపల్లిగూడెంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న వలవల బాబ్జి

మహాత్మా గాంధీకి ఘన నివాళి

» వాడవాడలా వర్ధంతి కార్యక్రమాలు

భీమవరంటౌన్, జనవరి 30(ఆంధ్రజ్యోతి) : మహాత్ముడి ఆశయాలు నెరవేర్చడమే నేటి యువత బాధ్యత అని భీమవరం తహసీల్దార్ రావి రాంబాబు, ఎస్టీవో అల్లూరి రవివర్మ అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో క్విట్ ఇండియా స్తూపం వద్ద గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి ముగ్గురికి మహాత్మాగాంధీ స్మారక అవార్డులు, పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, దళిత సంఘ అధ్యక్షుడు గంటా సుందర్‌కుమార్, పి.బాబ్జీ, భట్టిప్రోలు శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు. మునిసిపల్ కార్యాలయఆవరణలో ఉన్న గాంధీ విగ్రహానికి మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు. మునిసిపల్ ఇంజనీర్ త్రినాథ్, రెవెన్యూ ఆఫీసర్ రంగారావు, సిబ్బంది పాల్గొన్నారు.

● నరసాపురం టౌన్/మొగల్తూరు : నరసాపురం వైఎన్ కళాశాల గాంధీ అధ్యయన కేంద్రంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణ నివాళులర్పించారు. విద్యార్థులతో పట్టణంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజారాజేశ్వరి, మండల పరిషత్‌లో ఎంపీడీవో రామకృష్ణంరాజు గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మొగల్తూరు మండలం మొగల్తూరులో వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి క్లబ్ అధ్యక్షురాలు నీమకుర్తి అరుణ పూలమాల వేసి నివాళులర్పించారు.

● తాడేపల్లిగూడెం అర్బన్ : తాడేపల్లిగూడెం పట్టణంలోని గాంధీ మండపం వద్ద వున్న గాంధీజీ విగ్రహానికి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పట్నాల రాంపండు, పద్మనాభుని మురళి, కళ్యాణం రామచంద్రరావు, ఎరుబండి సతీష్, ముప్పిడి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

● గణపవరం : గణపవరం సచివాలయం ఆవరణలో అఖిల భారత హ్యాండ్‌లూమ్ బోర్డు మాజీ డైరెక్టర్ నంద్యాల రామలింగరాజు ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గణపవరం డిగ్రీ కాలేజీ ఆవరణలో గాంధీ విగ్రహానికి ప్రిన్సిపాల్ డాక్టర్ నిర్మలకుమారి నివాళులర్పించారు. వైస్ ప్రిన్సిపాల్ మధురాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

● పాలకొల్లుఅర్బన్ : పాలకొల్లు పట్టణంలోని వాసవీ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఉన్న గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూల మాలలు వేసి పలువురు నివాళులర్పించారు. ఎల్ఆర్‌పేట, ఆదిత్య కాలనీల్లో, మఠం వీధిలో, గాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. హైకోర్టు న్యాయవాది, మహిళా నాయకురాలు కర్రా జయసరిత మహాత్మ గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

● అత్తిలి :అత్తిలి తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి తహసీల్దార్ దశిక వంశీ పూలమాల వేసి నివాళులు అర్పించారు. డీటీ వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పీహెచ్‌డీ

భీమవరం రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కొట్టేడ తరుణ్‌కుమార్ చేసిన పరిశోధనలకుగాను ఎన్ఐటీ జలంధర్ మెకానికల్ ఇంజనీరింగ్‌లో పీహెచ్‌డీ ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ మురళీకృష్ణంరాజు తెలిపారు. కళాశాల యాజమాన్యం తరఫున సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ డాక్టర్ తరుణ్ కుమార్‌ను ఘనంగా సత్కరించారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.జగపతి రాజు, మెకానికల్ ఇంజనీరింగ్ హెడ్ డాక్టర్ కె.సురేష్‌బాబు మాట్లాడారు.

ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ

భీమవరం రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కొవ్వాడ అన్నవరం గ్రామంలో ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ గురువారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నిషేధిత ప్లాస్టిక్ వాడకం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. కిరాణా షాపులలో ప్లాస్టిక్ వాడరాదనే స్టిక్కర్‌లను అంటించారు. కార్యదర్శి శ్యామ్, అంగన్‌వాడీ టీచర్‌లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తులు

తణుకు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : కల్లుగీత కులాలకు సంబంధించి తణుకు ఎక్సైజ్ శాఖ పరిధిలో ఐదు షాపులకు నోటిఫికేషన్ జారీ చేశామని సీఐ సత్తి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని శెట్టిబలిజ రామాలయం వద్ద అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఒక వ్యక్తి జిల్లాలో ఎన్ని షాపులుకైనా దాఖలు చేసుకోవచ్చని, ఒక షాపు మాత్రమే కేటాయిస్తామన్నారు. దరఖాస్తు ఫీజు రూ.రెండు లక్షలుగా నిర్ణయించారన్నారు. వివరాల కోసం 94409 02436 నంబరులో సంప్రదించాలన్నారు.

ఆరోగ్య సహాయకులను విధుల్లోకి తీసుకోవాలి

పెనుమంట్ర, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగాల నుంచి తొలగించిన వైద్య ఆరోగ్య శాఖలోని దాదాపు వెయ్యి మంది ఆరోగ్యసహాయకుల పునర్నియామకం కోసం మూడు నెలలు అవుతున్నా పట్టించు కోవడం లేదని ఏపీ పారా మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీ.వీ.వీ.ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం పొలమూరులో ఆయన మాట్లాడుతూ శుక్రవారం పెనుగొండ వాసవీధామ్‌కు విచ్చేస్తున్న సీఎం చంద్రబాబునాయుడుకు తమ ఆవేదన ఆయన దృష్టికి వెళ్లేందుకు ఈ విషయాన్ని తెలుపుతున్నామన్నారు. ఇప్పటికే ఇదే విషయాన్ని వివరిస్తూ సీఎంకు లేఖ రాశానన్నారు. ఇప్పటికైనా త్వరితగతిన పునర్ని యామకం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం న్యాయం చేస్తుందనే నమ్మకంతోనే ఉన్నామన్నారు.

పేద కళాకారులను ఆదుకోవడం అభినందనీయం

తాడేపల్లిగూడెం రూరల్ జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రంగస్థల కళాకారుల్లో ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నవారికి అండగా నిలవడం అభినందనీయమని పెద తాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం అన్నారు. తాడేపల్లిగూడెం పట్టణంలోని గీతా మందిరం వద్ద రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సత్కార కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సగర సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏపూరి సత్యనారాయణ, సాపాటి మల్లేశ్వరరావు, పాలుకొండ శివకుమార్‌లను సత్కరించారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న కళాకారిణి ముగ్గు వెంకట రమణకు రూ.45,200 నగదు అందించారు. కార్యక్రమంలో రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘ అధ్యక్షుడు నూరంపూడి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి చింతకాయల వంశీకృష్ణ, పెంటపాడు ఎంఈవో టీవీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి రాజశేఖరాన్ని గెలిపిద్దాం : అంజిబాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అంజిబాబు, పక్కన అభ్యర్థి రాజశేఖరం

భీమవరంటౌన్/భీమవరం అర్బన్/ పాలకొల్లు అర్బన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపిద్దామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు పిలుపునిచ్చారు. భీమవరం నియోజకవర్గ ఎన్డీఏ కూటమి ముఖ్య నాయకుల సమావేశం చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు అధ్యక్షతన గురువారం సాయంత్రం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 27వ తేదీన కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి విజయంసాధించాలన్నారు. మంతెన రామరాజు మాట్లాడుతూ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరానికి అత్యధిక ఓట్లతో గెలిపించేందుకు కష్టపడి పనిచేయాలన్నారు. అనంతరం టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, భీమవరం టీడీపీ పరిశీలకుడు దాసరి ఆంజనేయులు మాట్లాడారు. ఉమ్మడి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి, మెంటే పార్థసారథి కోళ్ల నాగేశ్వరరావు వేండ్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. పాలకొల్లు టీడీపీ కార్యాలయానికి కూటమి బలపరిచిన అభ్యర్థిగా పేరాబత్తుల రాజశేఖరం ప్రచారం నిమిత్తం వెళ్లి మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్, కూటమి నాయకులు పెచ్చెట్టి బాబు, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, బోణం చినబాబు, తదితరులు పాల్గొన్నారు.

డీఎం వైఖరిని నిరసిస్తూ ఎన్ఎంయూ నాయకుల ఆందోళన

భీమవరంటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ డిపోలో వున్న 33 సమస్యలపై డీఎం సత్యనారాయణమూర్తికి ఎన్ఎంయూ లేఖ ఇచ్చినప్పటికీ పరిష్కారం కోసం చర్చలకు ఆహ్వానించకుండా కాలయాపన చేస్తూ ఉద్యమ కార్యాచరణకు ప్రేరేపిస్తున్నట్టు వ్యవహరిస్తున్నారని ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ పి.సోమరాజు, జిల్లా కార్యదర్శి వైవీరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆర్టీసీ గ్యారేజీ వద్ద గేట్ మీటింగ్ నిర్వహించి మూడో రోజు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యారేజీలో మెకానిక్ యూవీ రావును అక్రమంగా సస్పెండ్ చేశారని, దానిని వెంటనే రద్దుచేసి విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కట్టా రామారావు, సూర్యనారాయణ, ఏఎస్ఆర్ ప్రకాష్‌బాబు, మేళం నాగబాబు, ఎస్.రమేష్‌బాబు, నందు, బీవీఎస్‌రావు, నవీన్, మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్థులు, రైతులు

రాజు కాల్వ చెంత ఇళ్ల నిర్మాణాలు తొలగించాలి

కుముదవల్లి గ్రామస్థులు, రైతుల ధర్నా

పాలకోడేరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పాలకోడేరు శివారు రాజు కాల్వ చెంత ఇరిగేషన్ స్థలంలో నిర్మాణాలు తొలగించాలని కుముదవల్లి గ్రామస్థులు, రైతులు డిమాండ్ చేశారు. రాజు కాల్వను ప్రక్షాళన చేయాలని, అక్రమ నిర్మాణా లు తొలగించాలని కోరుతూ పంచాయతీ కార్యా లయం, తహసీల్దార్ కార్యాలయం వద్ద గురవా రం ధర్నా నిర్వహించారు. రాజు కాలువ వెంబడి ఇళ్లను తొలగించి, తమ గ్రామానికి రక్షిత నీరు, సాగునీరు అందించాలని నినాదాలు చేశారు. భూపతిరాజు శ్రీకృష్ణవర్మ మాట్లాడుతూ రాజు కాలువకు చేర్చి తమ గ్రామానికి చెందిన వరి ఆయకట్టు ఉందన్నారు. రాజు కాలువ నుంచే సాగు, తాగునీరు తమ గ్రామానికి సరఫరా అవుతుందన్నారు. కాల్వ గట్టును చేర్చి ఇళ్లను నిర్మించడంతో తాగు, సాగునీరు జలాలు కలుషితమయ్యాయన్నారు. సమస్యను ఉప సభాపతి కనుమూరు రఘురామకృష్ణరాజు దృష్టికి తీసుకువెళ్లగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారన్నారు. కొంతమంది ఉద్దేశపూర్వకంగా పలు ఆరోపణలు చేయడం తగదని విమర్శించారు. సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. అనంతరం తహసీల్దార్ ఎన్.బి.వి జయలక్ష్మికి వినతిపత్రాన్ని అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. అనంతరం పాలకోడేరు నుంచి భీమవరం కలెక్టరేట్ వరకు గ్రామస్థులు, రైతులు ర్యాలీ నిర్వహించి అక్కడ ఆందోళన చేశారు. సాగి మధుసూదనరాజు, బుద్ధరాజు బలరామరాజు, కలిదిండి సుబ్రహ్మణ్యంరాజు, భూపతిరాజు నాగేంద్రవర్మ, సాగి సుబ్బరాజు, పి.శ్రీనివాసరావు, భూ పతిరాజు పాండురంగరాజు, భూపతిరాజు రంగరాజు, సీహెచ్.నారాయణరావు, మల్లుల వెంకన్నబాబు, నక్క అప్పలరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

నేడు వాసవీ మాతకు లక్ష చామంతుల పూజ

భీమవరంటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : భీమవరం త్యాగరాజ భవనంలో ఆర్యవైశ్య వర్తక సంఘ భవనం ఆధ్వర్యంలో శుక్రవారం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినం నిర్వహిస్తామని సంఘం కార్యదర్శి తటవర్తి బదరీ లక్ష్మీనారాయణ తెలిపారు. ఉదయం గ్రామోత్సవం, రథోత్సవం, అష్టోత్తర కలశాభిషేకం, లక్ష చామంతి పూలతో లక్ష పుష్పార్చన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమానికి కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు తదితరులు హాజరవుతారన్నారు.

బాబా ఆలయంలో అన్నసమారాధన

మొగల్తూరు : మాఘమాస తొలి గురువారం సందర్భంగా స్థానిక రామాలయం వీధిలోని బాబా ఆలయంలో అన్నసమారాధన నిర్వహించారు. రామన్నపాలెం, కేపీ పాలెం గ్రామాల్లోని బాబా ఆలయాల్లో గురువారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనల్లో వందలాది మంది భక్తులు పాల్గొన్నారు.

భీమవరం కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ డీసీ పరిశీలన

భీమవరం క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత భీమవరంలోని కార్యాలయాన్ని గురువారం పరిశీలించారు. భీమవరం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని భీమవరం పట్టణం, వీరవాసరం మండలాల్లో కల్లుగీత కులాలకు కేటాయించిన మద్యం దుకాణాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. డాక్టర్ ఆర్ఎస్ కుమరీశ్వరన్, సీఐ కె.బలరామరాజు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో హరికథ గానం

భీమవరంటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : మావుళ్ళమ్మ ఆలయ వార్షిక మహోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం విజయనగరానికి చెందిన హరికథ కళాకారిణి కాళ్ళ నిర్మల చేసి హరికథ గానం ఆధ్యాత్మిక వాతావరణంలో సాగింది. రాత్రి 8 గంటలకు భీమవరానికి చెందిన శ్రీఆకాశ ఆర్కెస్ట్రా వారిచే సినీ సంగీత విభావరి నిర్వహించారు.



మాట్లాడుతున్న కలవకొలను తులసీ

లేసు అల్లికలపై శిక్షణ

నరసాపురం రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) :రుస్తుంబాద లేసు ట్రేడింగ్ సెంటర్‌లో గురువారం లేసు అల్లికలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రేడింగ్ కన్వీనర్ కలవకొలను తులసీ ప్రారంభించారు. ఎనిమిది రోజుల పాటు 20 మంది మహిళలకు లేసు అల్లికలు, బొమ్మలపై డిజైనర్లను తీసుకొచ్చి శిక్షణ ఇస్తామన్నారు. కొత్త కొత్త డిజైన్లు, ఆన్‌లైన్ మార్కెటింగ్ విధానం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. మహిళా కళాశాల ప్రిన్సిపాల్ మదుషాలిని మాట్లాడుతూ లేసు అల్లికలపై ఇచ్చే శిక్షణను మహిళలు సద్వినియోగపర్చు కోవాలన్నారు. అపర్ణ లక్ష్మి, అడ్డగళ్ళ బాబా, రాజీవ్ చంద్ర, చినమిల్లి దివాకర్ పాల్గొన్నారు.

దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

నరసాపురం టౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పలు దుకాణాల్లో కమిషనర్ అంజయ్య గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని ఇటీవల వ్యాపారులకు తెలియజేశారు. అయినప్పటికీ చాలామంది వీటిని వాడుతుండడంతో ఆయన షాపుల్లో తనిఖీలు చేశారు. పలు షాపుల్లో ప్లాస్టిక్ కవర్లు అమ్మకాలు గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి విక్రయిస్తే సీజ్ చేస్తామని హెచ్చరించారు. వి.ప్రసాద్, పాత్రుడు, కిషోర్, నరేష్ ఉన్నారు.

ఒకటిన విశ్వకర్మ యోజనపై సదస్సు

ఆకివీడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా చేతి వృత్తి కార్మికులకు పలు అంశాలపై శిక్షణ అందిస్తున్నట్టు దుంపగడప వీవీగిరి ప్రభుత్వ కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి డాక్టర్ ప్రతాప్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ సుజాత అన్నారు. గురువారం స్థానిక బలరాం నర్సింగ్ హోమ్ వద్ద వారు విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఫిబ్రవరి 1న వి-కన్వెన్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న విశ్వకర్మ యోజన అవగాహన సదస్సులో చేతివృత్తి కార్మికులు హాజరై జయప్రదం చేయాలన్నారు. వృత్తి నైపుణ్యం, నాణ్యత పెంచుకోవడమే పలు సంఘాల కార్మికులు హాజరవుతారన్నారు. అభివృద్ధి కమిటీ సభ్యుడు దాసరి సత్యనారాయణ ఉన్నారు.

రేపటి నుంచి ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవ్

ఆకివీడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల వాడకం నిషేధించాలని, ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ప్లాస్టిక్ కవర్లు వాడితే చర్యలు తప్పవని నగర పంచాయతీ కమిషనర్ జి.కృష్ణమోహన్ హెచ్చరించారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం నుంచి మెయిన్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి పలు వర్తకులకు అవగాహన కల్పించి మాట్లాడారు. కార్యక్రమంలో మేనేజర్ వెంకటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సాకేత్ తదితరులు ఉన్నారు.

'సూపర్ సిక్స్' అమలు చేయాలి

తణుకు రూరల్, జనవరి 30, (ఆంధ్రజ్యోతి) : అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ అమలు చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చి ప్రస్తుతం ఇవ్వలేమని చెప్పడం మోసం చేయడమేనని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గురువారం తణుకు వైసీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 5న విద్యార్థుల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేస్తామన్నారు. నాయకులు చినిమిల్లి వెంకట్రా యుడు, పెన్మత్స సుబ్బరాజు, సాయిబాబారెడ్డి, బలరామకృష్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలుపుదల

భీమవరం రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : పెదగరువు విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో చెట్ల కొమ్మలు తొలగించు నిమిత్తం శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. పెదగరువు, రాజులగరువు, వెంప, శ్రీరామపురం, శివన్నారాయణపురం, ఆక్వా చెరువులకు కరెంట్ సరఫరా ఉండదన్నారు.

● తాడేపల్లిగూడెం రూరల్ : పెదతాడేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం ఐదు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కె.నరసింహమూర్తి తెలిపారు. దువ్వ, యర్నగూడెం సబ్‌స్టేషన్‌ల నుంచి విద్యుత్తు సరఫరా తీసుకుంటామని అత్యవసరంగా కరెంట్ నిలుపుదల చేయాల్సి వస్తే అంతరాయానికి సహకరించాలన్నారు.